

కలెక్టరేట్ నిర్మాణమయ్యేనా ?

- పుష్కరకాలం నుంచి ముందుకు పడని అడుగులు
- అధికారులు, ప్రజలకు ఇబ్బందిగా పాత భవనం
- కొత్తది ఏర్పాటుకు మహానాడులో తీర్మానం
- తాజాగా అధికారులు మరోసారి ప్రతిపాదనలు
- రూ.58 కోట్లు అవసరమని కలెక్టర్ లేఖ



కలెక్టరేట్ నిర్మాణానికి ప్రతిపాదించిన నగరంలోని టీబీ ఆసుపత్రి ప్రాంగణంలోని స్థలం

నెల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బ్రిటీషు కాలంనాటి భవనంలో నేటికీ కలెక్టరేట్ కొనసాగుతోంది. అందులో కనీస సౌకర్యాలు లేవు.. ఎప్పుడు పెచ్చులూడుతాయో తెలియదు.. అంతా ఇరుకు ఇరుకే... అయినా కొత్త కలెక్టరేట్ నిర్మాణంలో కదలికలేదు. తొలుత ప్రభుత్వం నిధులిచ్చినా కోర్టు కేసుతో బ్రేకులు పడ్డాయి. ఆ తర్వాత కోర్టు కేసు క్లియర్ అయినా ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు... ఇలా పుష్కరకాలం గడిచిపోయింది. అయితే తాజాగా మరోసారి కలెక్టరేట్ నిర్మాణంలో కదలిక వచ్చింది. ఇటీవల మినీ మహానాడులో తీర్మానించడం, ఆ వెంటనే కలెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాయడంతో నిర్మాణంపై ఆశలు రేగాయి. మరి ఈసారైనా అనుమతులు లభిస్తాయా..? అన్నది చర్చనీయాంశంగా మారింది.

కాలానుగుణంగా వసతులు అవసరం

మారుతున్న పాలనకు అనుగుణంగా అవసరాలు పెరుగుతుండడంతో ప్రస్తుతమున్న కలెక్టరేట్ ఇరుకుగా మారింది. రికార్డులు కూడా సక్రమంగా పెట్టుకోలేక అధికారులు అవస్థలు పడుతున్నారు. వర్షం వస్తే నీరు కారడం, ఉరవడం, పెచ్చులు ఊడిపడుతుండడంతో ఉద్యోగులు భయంభయంగానే విధులు నిర్వహిస్తున్నారు. నగరంలోని పాత టీబీ ఆసుపత్రి ప్రాంగణంలో కలెక్టరేట్‌ను నిర్మిస్తే పాలనాపరంగా చాలా ప్రయోజనాలుంటాయని పుష్కరకాలం క్రితం అప్పటి అధికార వర్గాలు భావించాయి. అంతేకాక అక్కడికి సమీపంలోనే కలెక్టర్, జేసీ బంగ్లాలు ఉన్నాయి. సమీపంలోని జడ్పీ కార్యాలయం ఆవరణలో కీలకమైన జడ్పీ, డీపీవో, డ్వామా, పంచాయతీరాజ్, జిల్లా ఎమర్జెన్సీ సెంటర్ ఉండటం, మరోవైపు కార్పొరేషన్ కార్యా లయం ఉండడం కలిసొచ్చే అంశం. ఇక ప్రస్తుతమున్న కలె క్టరేట్ చుట్టూ నిత్యం ట్రాఫిక్ ఉంటుంది. దీంతో ప్రతి వారం పీజీఆర్ఎస్‌కి వచ్చే ప్రజలకు, అధికారులకు పార్కింగ్ సమస్య కూడా ఉంది. వీటన్నింటి నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య లేని, విశాలమైన టీబీ ఆసుపత్రి ప్రాంగణంలో కలెక్టరేట్ నిర్మిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని భావించారు. అందు కు రూ.35 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. కానీ స్థలం, టెండర్ల వ్యవహారాలు కోర్టు మెట్లెక్కడంతో కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి ఆదిలోనే బ్రేక్ పడింది. కాగా కోర్టు కేసుల నుంచి కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి మూడేళ్ల క్రితం మార్గం సుగమమైంది. దీంతో తాజాగా అంచనాలు తయారు చేసి రూ.58 కోట్లు అవసరమని అప్పటి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను పట్టించుకోలేదు.

ఫైలు కదలిక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కలెక్టరేట్ నిర్మాణ ప్రతిపాదనల్లో కదలిక వచ్చింది. గతంలో ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలను ఆమోదించాలని తాజాగా మరోసారి కలెక్టర్ ఓ ఆనంద్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన నెల్లూరు పార్లమెంటు టీడీపీ మినీ మహానాడులో కూడా కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి తీర్మానించారు. ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించాలని జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలంతా నిర్ణయించారు. దీంతో నెల్లూరులో నూతనంగా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మించేందుకు అడుగు లు ముందుకు పడుతున్నాయి. కలెక్టరేట్ ఆవరణలో ఉండే కార్యాలయాన్నింటిని కూడా కొత్త కలెక్టరేట్ నిర్మించే ప్రాంతానికి తరలించాలన్న ఆలోచన కూడా జరుగుతోంది. త్వరలోనే అనుమతులు మంజూరయ్యే అవకాశాలున్నట్లు ఉన్నతాధికార వర్గాలు చెబుతు న్నాయి. ఈ అంశంపై డీఆర్వో ఉదయభాస్కర్‌రావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పాత టీబీ ఆసుపత్రి ప్రాంగణంలో నూతన కలెక్టరేట్ నిర్మాణానికి తాజాగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. దీనిపై ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.



నగరంలోని మినీ బైపాస్‌లో ఆదివారం జరిగిన ఆనం వెంకటరెడ్డి విగ్రహ పునఃఆవిష్కరణలో పాల్గొన్న మంత్రులు ఆనం, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు



సభలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

పేదల అభ్యున్నతికి పాటుపడిన ఆనం వెంకటరెడ్డి

- మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 8(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతికి మాజీ మంత్రి స్వర్గీయ ఆనం వెంకటరెడ్డి ఎంతగానో పాటుపడ్డారని పురపాలక శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని రామలింగాపురం మినీబైపాస్‌లో సింహపురి సేవా సమితి ఆధ్వర్యంలో వెంకటరెడ్డి విగ్రహ పునఃఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ రూపశిల్పి ఆనం వెంకటరెడ్డి అని కొనియాడారు. ఇరిగేషన్ మంత్రిగా జిల్లాకు నీటి ప్రాజెక్టులను తెచ్చి, రైతులకు ఎంతో మేలు చేశారని చెప్పారు. ఆనం కుటుంబంతో తనకు ఎనలేని అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా రాజకీయ ముఖ చిత్రంలో ఆనం వెంకటరెడ్డిది చెరపలేని ముద్ర అని చెప్పారు. రైతు కుటుంబం నుంచి వచ్చి రాజకీయాల్లో ఎదిగిన కుటుంబం తమదన్నారు. సమస్యల పరిష్కారం కోసం తన తండ్రి వద్దకు కందుకూరు ప్రాంతం నుంచి కూడా ఎడ్లబండ్లపై ప్రజలు వచ్చేవారని చెప్పారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు తరాలుగా ప్రజాసేవకు ఆనం కుటుంబం అంకితమవుతూ, ప్రజలకు అన్నీ విధాలా అండగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముందుగా ఆనం వెంకటరెడ్డి జీవిత ప్రస్థానాన్ని మనుమరాలు ఆనం కైవల్యారెడ్డి వివరించారు. అనంతరం ఆనం వెంకటరెడ్డి విగ్రహ పునః ఆవిష్కరణను, పైలాన్‌ను మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ఆవిష్కరించారు. ఆనం వెంకటరెడ్డి జీవిత చరిత్ర పుస్తకాన్ని మంత్రి నారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, పాశం సునీల్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నేతలు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బీజేపీ నేత దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, సీపీఎం నేత మాదాల వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ మదాసు గంగాధర్, ఆనం సోదరులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థికి పదో ర్యాంక్



బద్రిరాజు వెంకటమణి ప్రీతమ్

నెల్లూరు(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం సాయంత్రం విడుదల చేసిన ఏపీ ఈఏపీసెట్ ఫలి తాల్లో జిల్లాలోని కందుకూరుకి చెందిన బద్రిరాజు వెంకటమణి ప్రీతమ్ పదోర్యాంకు సాధించాడు. ఇంజనీరింగ్, వ్యవ సాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు జిల్లా వ్యాప్తంగా 11,560 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇంజనీరింగ్‌కు 8,913 మంది, వ్యవసాయ ఫార్మసీ కోర్సులకు 2,647 మంది పరీక్ష రాశారు. ఇంజనీరింగ్‌లో 5,993 మంది, వ్యవసాయ, ఫార్మసీ విభాగంలో 2,263 మంది ఉత్తీర్ణత సాధించారు.

● గత నెలలో ఏపీ ఈఏపీ సెట్

ఈఏపీసెట్‌ను మే 19, 20వ తేదీల్లో బైపీసీ స్ట్రీమ్‌కు, 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని కావలి పీబీఆర్ విశ్వోదయా ఇంజనీరింగ్ కళాశాల, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, కోవూరు గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరు రూరల్ మండల పొట్టేపాళెంలోని ఐయాన్ డిజిటల్ జోన్‌లలో ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. ఫలితాలను ఆదివారం విడుదల చేయడంతో ఇంజనీరింగ్‌లో బాలురు 3,213 మంది, బాలికలు 2,780 మంది కలిపి మొత్తం 5,993 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల్లో బాలురు 536 మంది, బాలికలు 1,727 మంది కలిపి మొత్తం 2,263 మంది ఉత్తీర్ణత సాధించి, కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారు.

కంప్యూటర్ సైన్స్ చదువుతా...

కందుకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక ఐఐటీల్లో కంప్యూటర్ సైన్స్(ఏఐ టెక్నాలజీ)లో ఇంజనీరింగ్ చదవడమే తన లక్ష్యమని ఏపీ ఈఏపీ సెట్‌లో 10వ ర్యాంకు సాధించిన బద్రిరాజు వెంకట మణిప్రీతం తెలిపారు. తనకు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఓపెన్ క్యాటగిరిలో 2034 ర్యాంకు వచ్చినందున ప్రతి ష్టాత్మక ఐఐటీ లో తప్పకుండా సీటు వస్తుం దని ధీమాగా ఉన్నట్లు ఆయన తెలి పారు. మణిప్రీతమ్ తల్లిదండ్రులు బద్రిరాజు నారాయణమూర్తి, రజిని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తు న్నారు. కాగా ఆయన తాత బద్రిరాజు లక్ష్మీనరసింహరావు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడే. తన తల్లిదండ్రుల దిశానిర్దేశం, గురువుల ప్రోత్సాహం వల్లే తాను ఏపీ ఈఏపీ సెట్‌లో పదో ర్యాంకు సాధించగలిగానని మణిప్రీతమ్ తెలిపారు. ఐఐటీలో విద్యాభ్యాసం చేసి ఏఐ ఆధారిత ప్రయోగాలు, స్టార్టప్ కంపెనీ ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర ర్యాలీలు

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా సోమవారం యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కే. కార్తీక్ అధికారులను ఆదేశించారు. ఆదివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంపై అధికారులకు సూచనలిచ్చారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు వద్ద ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది అంతా పాల్గొనాలని కోరారు.

'సాక్షి'పై తెలుగు మహిళల ఆగ్రహం

నెల్లూరులో భారీ ప్రదర్శన

నల్లచీరలు ధరించి కదంతొక్కిన మహిళలు

జిల్లావ్యాప్తంగా స్టేషన్లలో ఫిర్యాదులు

నెల్లూరు నగరంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న తెలుగు మహిళలు



నెల్లూరు (వైద్యం) జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతి వేశ్యల రాజధాని అంటూ సాక్షి చానల్‌లో విమర్శలు గుప్పించని జర్నలిస్టులపై తెలుగు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఆదివారం నల్లచీరలు ధరించిన వారు కదం తొక్కారు. నగరంలోని గాంధీబొమ్మ నుంచి వీఆర్‌సీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తప్పుడు రాతలు రాసిన సాక్షిపై, తప్పుడు కూతలు కూసిన జర్నలిస్టు కృష్ణంరాజు, డిబేట్ నిర్వహించిన కొమ్మినేనిపై చర్యలు తీసుకోవాలంటూ నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నగర మహిళా అధ్యక్షురాలు రేవతి మాట్లాడుతూ మహిళలను కించ పరిచేలా వ్యవహరించిన జగన్ అండ్ కోలను శిక్షించాలని డిమాండ్ చేశారు. దేవతల రాజధాని అమరావతిని వేశ్యల రాజధానిగా మాట్లాడటం సిద్దుచేటన్నారు. మహిళలను కించ పరిచే మాటలు మానకుంటే నాలుక కోస్తామంటూ ఆమె హెచ్చరించారు. ఏపీపై విషం చిమ్ముతున్న సాక్షి పేపరు, టీవీని బ్యాన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, టీడీపీ నేతలు, మహిళలు పాల్గొన్నారు.

● జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): సాక్షి చానల్‌లో నిర్వహించిన డిబెట్‌లో అమరావతి వేశ్యల రాజధాని అంటూ మాట్లాడిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్‌లు, సాక్షి చానల్‌పై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు కోరారు. ఆదివారం నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో ఈ మేరకు తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు అరుణమ్మ, ఆబీదా సుల్తానా, మాధవి, వనజారెడ్డి, శాంతి, తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మహిళలు



వరికుంటపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు, మహిళలు

● తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

కావలి, (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించపరిచేలా మాట్లాడిన వైసీపీ నేతలు, ఆ పార్టీ చానల్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కావలి పట్టణ టీడీపీ మహిళా అధ్యక్షురాలు అర్షియాబేగం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

● పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి): అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి మీడియా, జర్నలిస్టులపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఆదివారం టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పీ. మాధవరావు, నాయకులు భాగ్యమ్మ, శాంతికుమారి, నల్లగొండ్ల వెంగళరావు, రవి, బాలచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వృద్ధురాలికి కొవిడ్

- జిల్లాలో 8కి చేరిన కరోనా కేసులు

నెల్లూరు (వైద్యం) జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని వనంతోపులో మరో కరోనా కేసు నమోదైంది. ఆదివారం ఆ ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలు(61)కి కరోనా ఉన్నట్లు నిర్ధారణ అయింది. నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో ఆమెకు కరోనా పరీక్ష చేయగా, కొవిడ్ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. కరోనా లక్షణాలు చాలా తక్కువగా ఉండటంతో ఆమెను హోం ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స నిర్వహిస్తున్నారు. దీంతో నెల్లూరు నగరంలో ఐదో కరోనా కేసులు నమోదు కాగా, జిల్లా వ్యాప్తంగా 8 కేసులు నమోదయ్యాయి. ఈ నెల 5న జిల్లాలో 6 కేసులు నమోదు కాగా, 6న మరో కరోనా కేసు నమోదైంది. ఆదివారం కూడా మరో కేసు వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాలో కరోనా కేసులు పెరుగుతుండటంతో కరోనాపై అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

కందుకూరు డివిజన్‌లో గాలివాన

- ఈదురుగాలులతో మామిడికి భారీ నష్టం
- పలుచోట్ల విద్యుత్ అంతరాయం

కందుకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. డివిజన్‌లోని వలేటివారిపాలెం, లింగసముద్రం, గుడ్లూరు మండలాల్లో గంటకు పైగా పెనుగాలులతో వర్షం కురవగా కందుకూరు, ఉలవపాడు మండలాల్లో ఉధృతంగా గాలి వీచి, చిరు జల్లులు కురిశాయి. ఈదురు గాలుల ధాటికి పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి పడగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లో పలు చోట్ల విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో రాత్రి పొద్దుపోయే వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు. పెనుగాలులకు కందుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా మామిడి తోటల్లో కాయలు రాలిపోయి రైతులకు నష్టం వాటిల్లింది. ఇప్పటికే ధరలు లేక పండు ఈగ కారణంగా కాయలు నాణ్యత లేక నష్టపోతున్న మామిడి రైతుకు ఈ పెనుగాలులు గోరుచుట్టుపై రోకటిపోటులా మారాయి.

డోంట్ కేర్ !

- గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు
- పెన్నాలో ఇష్టానుసారం ఇసుక తవ్వకాలు
- నదిలో భారీగా ఏర్పడిన గుంతలు
- చోద్యం చూస్తున్న అధికారులు



పెన్నానదిలోకి ప్రవేశించరాదని అధికారులు అడ్డుగా పెట్టిన గేటు, పక్కనుంచి వెళుతున్న ఇసుక ట్రాక్టర్

నెల్లూరు(వెంకటేశ్వరపురం) జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నదుల్లో ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు జిల్లాలో ఎక్కడా అమలు కావడంలేదు. జూన్ 1 నుంచి అక్టోబరు 15 వరకు నదుల్లో ఇసుక తవ్వకాలు జరపరాదని ఇప్పటికే ట్రిబ్యునల్ ఆదేశాలు జారీచేసింది. అయితే జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పెన్నాలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ, జమ్మిపాళెం, దీనదయాళ్ నగర్ ప్రాంతాల్లో వందలాది ట్రాక్టర్లు నదిలోకి ప్రవేశించి ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. అయినా సంబంధిత అధికారులు మాత్రం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. నామమాత్రంగా గేటు ఏర్పాటు చేసి దానికి తాళం వేశారు. అయితే గేటు పక్కనుంచి వందలాది ట్రాక్టర్లు ఇసుక కోసం నదిలోకి వెళుతున్నాయి.

● అధిక ధరలకు విక్రయాలు

మాన్‌సూన్ సీజన్ అయినా ఇసుకను అక్రమంగా తరలించుకుంటూ ట్రాక్టర్ల యజమానులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఉచిత ఇసుక పాలసీ వచ్చినప్పటి నుంచి ట్రాక్టర్ ఇసుక ధర రూ.1500 గా ఉంది. అయితే ప్రస్తుతం మాన్‌సూన్ సీజన్ పేరుతో కొందరు ట్రాక్టర్ల యజమానులు రూ.4వేల నుంచి రూ. 5వేలు తీసుకుంటున్నారు.

● నదిలో భారీగా గుంతలు

ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేయడంలో జిల్లా అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో వందలాది ట్రాక్టర్లు నదిలోకి వెళ్లి భారీగా గుంతలు చేస్తున్నాయి. దీంతో పెన్నాకు వరదలు వస్తే సమీప ప్రాంతాల్లోని కాలనీలకు ముప్పు తప్పదని స్థానికులు భయాందళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకుని ఇసుక తవ్వకాలను అడ్డుకోవాల్సి ఉంది.

పరిశీలించి, చర్యలు తీసుకుంటాం

ఈనెల ఒకటి నుంచి అక్టోబరు 15 వరకు నదుల్లో ఎలాంటి తవ్వకాలు జరపరాదు. ఇప్పటికే పెన్నానదిలోకి ప్రవేశించే ప్రాంతాల్లో గేట్లను ఏర్పాటు చేశాం. అయినా తవ్వకాలు జరుగుతుంటే, పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- షఫీమాలిక్, అర్బన్ తహసీల్దార్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 540

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.9249
వెండి కిలో ధర రూ. 108500
వెండి ఒక గ్రాము రూ.111.50



భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి) : త్రయోదశి తిథి సందర్భంగా ఆదివారం శైవ క్షేత్రాల్లో ప్రదోషకాల పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మూలస్థానేశ్వరాలయం, రాజరాజేశ్వరి ఆలయంలోని సుందరేశ్వరస్వామి సన్నిధిలో ముక్కంటికి, నందీ శ్వరుడికి విశేష అభిషేకాలు, అలంకారం జరిగాయి. మూలస్థానేశ్వర స్వామికి రాత్రి చిన్న వెండి నంది వాహనంపై ప్రాకారోత్సవం జరిగింది.

బుజబుజ నెల్లూరులో

కరెంటు కష్టాలు

● నిత్యం ట్రాన్స్‌ఫార్మర్ల దగ్ధం ● ఎడాపెడా విద్యుత్ కోతలు

నెల్లూరు(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 25వ డివిజన్‌లో ఉన్న బుజబుజ నెల్లూరు ప్రాంత వాసులు విద్యుత్ కష్టాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో వరుసగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతుండటంతో ఏ క్షణంలో ఏ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ పేలుతుందో అనే భయాందోళనతో ఉన్నారు. తాజాగా నివాస గృహాల నడుమ ఉండే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అధికలోడుతో పేలి అగ్నికి ఆహుతైంది. ఈ సమయంలో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడడంతో చుట్టపక్కల ప్రజలు బెంబేలెత్తిపోయారు. వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేయడంతో




భారీ ప్రమాదం తప్పింది. ఈ సమయంలో స్థానిక ప్రజలు అగ్నిమాపకశాఖ(ఫైర్)కు ఫోన్ చేయగా వారు అంత దూరం రాలేమని, వేరే మార్గాలు చూసుకోమని చెప్పడంతో ప్రజలకు ఏమి చేయాలో అర్థం కాలేదు. దీంతో విద్యుత్ సిబ్బంది, స్థానికులు శ్రమదానంతో మంటలను అదుపు చేశారు.

బుజబుజ నెల్లూరు ప్రాంతంలో నివాసాల కంటే కూడా వ్యాపార సంస్థలకు సంబంధించిన కరెంట్ అధికలోడు ట్రాన్స్‌ఫార్మర్లపై పడుతుండ టంతో నిత్యం ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. దీనిపై సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియచేసినా పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఎలాపెడా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఎప్పుడు కరెంటు తీసేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీనికితోడు లో ఓల్టేజీ, హైఓల్టేజీ కారణంగా గృహోపకరణాలు కాలిపోతున్నాయి. దీనివల్ల తాము ఆర్థికంగా నష్టపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే కార్పొరేషన్... వసతులు దుర్భరం

బుజబుజ నెల్లూరు ప్రాంతాన్ని నగరపాలక సంస్థలో కలిపి దాదాపు 15 ఏళ్ల అవుతున్నా ఈ ప్రాంతంలో నేటికీ కార్పొరేషన్ స్థాయి వసతులు మాత్రం కల్పించలేదు. దాదాపు 10వేల మందికిపైగా జనాభా ఉన్న ఈ ప్రాంతంలో నిత్యం విద్యుత్ అంతరాయాలు, వర్షాలు పడితే జలమయమయ్యే రోడ్లు, కాలనీలు, రోడ్లపైకి పొంగే డ్రైనేజీలు, మంచినీటి కొళాయిల్లో మురుగునీరు, అస్తవ్యస్థమైన రోడ్లు, దుర్గంధభరితమైన చెత్తకుప్పలతో ఈ ప్రాంతం దుర్భరంగా తయారైంది. పాలకులు ఎంతమంది మారినా బుజ బుజ నెల్లూరు రూపురేఖలు మాత్రం మారడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌కు సంబం ధించి 85 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా చెముడుగుంట పంచాయతీ పరిధిలోని కేంద్ర కారాగారం, జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం, నక్కలకాలనీ ఇలా కార్పొరేషన్‌కు సంబంధంలేని పంచాయితీ ప్రాంతాలకు కూడా విద్యుత్ సరఫరా జరుగుతోంది. దీంతో విద్యుత్ లోడ్ అధికమై నిత్యం బుజబుజ నెల్లూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. చినుకు పడితే ఆ రోజు రాత్రి అంతా విద్యుత్ నిలిచిపోతోంది. ఇప్పటికైనా అధికారులు, నేతలు స్పందించి సమస్యలు పరిష్కరించాలని బుజబుజ నెల్లూరు వాసులు కోరుతున్నారు.



ఇటీవల తగలబడిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పంచాయతీలకు నోటీసులు

● ములుముడి పంచాయతీకి నగదు జమ

నెల్లూరురూరల్, జూన్8,(ఆంధ్రజ్యోతి) : పంచాయతీ చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కుల ద్వారా పంచాయతీలకు రావాల్సిన బకాయిలను వెంటనే జమ చేయించాలని కోరుతూ గ్రామ పంచాయతీలకు నోటీసులు జారీ చేసినట్లు నెల్లూరు రూరల్ మండల విస్తరణ అధికారి జే వెంకట రమేష్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఆదివారం వెలువడిన 'పంచాయతీలకు చేరని చేపల ఆదాయం' కథనానికి ఆయన స్పందించారు. మండలంలోని ములుముడి గ్రామంలో సిద్ది చెరువుకు రూ.7.50 లక్షలకు హక్కులు పొందిన వారు ఇప్పటికే రూ. 3.75 లక్షలు చెల్లించగా మిగిలిన రూ. 3.75 లక్షలను వసూలు చేసి పంచాయతీకి జమ చేయించినట్లు తెలిపారు. దీంతో పాటు కందమూరు, గొల్లకందుకూరు గ్రామాల్లో పంచాయతీకి రావాల్సిన చేపల ఆదాయాన్ని త్వరగా వసూలు చేసి ఖాతాలో జమచేయించాలని కార్యదర్శులకు నోటీసులు అందచేశామని పేర్కొన్నారు. ఇలా జమ అయిన నగదును ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రజల అవసరాలకు ఖర్చు చేయాలని సూచించామన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో సుదర్శన నారసింహ హోమం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సుదర్శన నారసింహ హోమం జరిగింది. స్వాతి నక్షత్రం సందర్భంగా ఈ హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన చిత్రగీత స్వరాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పురమందిరంలో ఆదివారం రాత్రి రాగం, తానం, పల్లవి బాలగంధర్వ గాన సభ ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బాల సుబ్రహ్మణ్యం చిత్ర గీత స్వరాభిషేకం శ్రోతలను ఓలలాడించింది.

1000 మొక్కల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎంజీబీ ఫెసిలిటీమాల్ 9వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా మాల్ ఛైర్మన్ ఎండీ గంగాధర్ సందర్శకులకు వెయ్యి మొక్కలు పంపిణీ చేశారు. ఈనెల 22 నుంచి 24వతేదీ వరకు కస్టమర్ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాల్ మేనేజర్ రాజశేఖర్, సహాయ మేనేజర్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

విడవలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలను చేయించుకోవటం వలన రైతులకు సాగు వ్యయం తగ్గుతుందని శాస్త్రవేత్త సుజాత తెలిపారు. పార్లపల్లి గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నాయన్నారు. సాగు ఖర్చులను ఏవిధంగా తగ్గించుకోవాలి అనే అంశంపై రైతులు అవగాహన కలిగివుండాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు కృష్ణయ్య, చక్రవర్తి, రైతులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి నూలుమాలలు వేశారు. ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం విద్యార్థులకు మహాత్మాగాంధీ జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

తోటపల్లి గూడూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తోందని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వాటిని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అధ్వాన్నంగా ఉన్న వెంకన్నపాలెం రోడ్డుకు రూ.70లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామంలో వీధిలైట్లు, తాగునీరు అందడంలేదని రాజగోపాల్‌రెడ్డికి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు కొణితం రఘుబాబు, నాయకుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షులు చింత సీతారామయ్య, గుడ్లూరు గోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మనుబోలును అభివృద్ధి చేస్తాం..

మనుబోలు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మనుబోలు పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త, ఎమ్మెల్యే తనయుడు సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం మనుబోలులో ఓ ప్రైవేట్ పాఠశాలను రాజగోపాల్ రెడ్డి, ఆయన సతీమణి శృతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగంలో మంత్రి నారా లోకేష్ సమూల మార్పులు తీసుకురానున్నారన్నారు. భూగర్భడ్రైనేజీ ఏర్పాటుకు గతంలో ఎమ్మెల్యే ప్రతిపాదనలు చేశారని, దానిపై పునరాలోచిస్తామని తెలిపారు.

త్వరలో కంటి వైద్య పరీక్షలు : వీపీఆర్

నెలూరు(హరనాథపురం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో జిల్లా వ్యాప్తంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో 10 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. జిల్లాలోని దివ్యాంగులందరికీ ట్రైసైకిళ్లు అందచేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే ట్రైసైకిళ్లు తీసుకున్న వారు వాటి విషయంలో ఇబ్బందులున్నా సంప్రదించాలని, ఫౌండేషన్ తరపున మెయింటెనెన్స్ చేయిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, జనసేన నాయకుడు గుడి హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగురాలికి ట్రై సైకిల్ పంపిణీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి


సీవీ సుబ్రహ్మణ్యంకు నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఆడిటర్, ఆధ్యాత్మిక వేత్త సీవీ సుబ్రహ్మణ్య శర్మ (సుబ్బప్ప)కు నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాళులర్పించారు. ఆదివారం జరిగిన సుబ్రహ్మణ్య శర్మ ఉత్తరక్రియలకు ఆయన హాజరయ్యారు. సుబ్బప్ప చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం

డివిజన్ కమిటీల ఎంపిక

నెల్లూరు (వైద్యం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 11, 16, 45 డివిజన్లకు భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీలను ఆదివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల పెంచలయ్య, ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మి కుల సంక్షేమ బోర్డును కార్మికుల సంక్షేమానికి విని యోగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోర్డులో పెండింగ్‌లో ఉన్న అన్నీ క్లెయిమ్‌లను పరిష్కరించాలన్నారు. కాగా, 11వ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులుగా పిండి కొట్టు శ్రీనివాసులు, కర్రేటి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. 16వ డివిజన్‌కు పుట్టా వెంకటేశ్వర్లు, పొన్నూరు శంకర్, 45వ డివిజన్‌కు కార్తీక్, దామవరపు ప్రదీప్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్ల సూర్యనారాయణ, సంపూర్ణమ్మ, రామిశెట్టి శ్రీనివాసులు, పసుపులేటి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



డివిజన్ కమిటీలకు ఎంపికైన వారితో నాయకులు

ఎన్ఎస్ఆర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

మనుబోలు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జట్లకొండూరులో ఎన్ఎస్ఆర్ (నారపరెడ్డి సీతారామిరెడ్డి) మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ చుట్టు పక్కల గ్రామాల నుంచి 15 జట్లు పోటీలో పాల్గొంటున్నాయని చెప్పారు. తొలిరోజు 10 జట్లు పోటీపడ్డాయని తెలిపారు. కొమ్మలపూడి హెచ్‌సీసీ, జట్లకొండూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కొమ్మలపూడి జట్టు విజయం సాధించింది. తరువాత మనుబోలు మెయిన్స్, కట్టువపల్లి స్ట్రైకర్స్‌తో తలపడగా మనుబోలు టీం గెలుపొందింది. ముద్దమూడి జాక్వర్, బద్దెవోలు భీమ్ సైన్యం మధ్య పోటీలో ముద్దమూడి జట్టు విజయం సాధించింది. కాగితాలపూరు వివేక్ లెవన్స్, పిడూరు లెవన్స్ పోటీపడగా కాగితాలపూరు లెవన్స్ జట్టు గెలిచింది. కాగితాలపూరు ఫ్రెండ్స్ లెవన్స్ జట్టుతో, మనుబోలు ఎంజీసీటీ జట్టు పోటీపడగా కాగితాలపూరు ఫ్రెండ్స్ లెవన్స్ జట్టు జయభేరి మోగించింది. టోర్నమెంట్ విజేత జట్టుకు రూ. 10వేల బహుమతిని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, రన్నర్ జట్టుకు రూ.7వేలను జట్లకొండూరు ఉపసర్పంచు తులసీరామ్ యాదవ్ ఇస్తున్నట్లుగా నిర్వాహకులు సునీల్, రమేష్, సురేంద్ర, బాలాజీ, పవన్, ఉదయ్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ముత్తుకూరు, జూన్ 8 : తాము చదువుకున్న పాఠశాలలో 37 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనానికి ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా మారింది. శనివారం ఈ పాఠశాలలో 1988లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలకు కావాల్సిన వసతులపై అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డితో చర్చించారు. ఆనాడు తమకు విద్య నేర్పిన గురువులు మస్తానయ్య, సారాబాయి, చంద్రమౌళిలను ఘనంగా సన్మానించారు. తమ ఉన్నతకి తోడ్పడిన పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం అందిస్తామని ఆర్గనైజర్లు కరణాల హరిబాబు, చౌకచర్ల సురేష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు షేక్ మస్తాన్, సన్నారెడ్డి శ్రీధర్‌రెడ్డి, మహమ్మద్ ఫయాజ్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.



చదువు నేర్పిన గురువులతో 1988 బ్యాచ్ విద్యార్థులు

హోరాహోరీగా

జర్నలిస్ట్స్-రెవెన్యూ క్రికెట్ పోటీ

● జేశాప్ జట్టు విజయం

నెల్లూరు(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే జర్నలిస్టులు, రెవెన్యూ సిబ్బంది మధ్య ఆదివారం ఆటవిడుపుగా క్రికెట్ టోర్నీ జరిగింది. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రెవెన్యూ టీమ్ నిర్ణీత 15 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. అనంతరం జేశాప్ జర్నలిస్ట్ జట్టు 14.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో గెలుపొందిన జర్నలిస్ట్ జట్టును రెవెన్యూ సిబ్బంది అభినందిం చారు. ఈ పోటీలను జేశాప్ రాష్ట్ర కార్యదర్శి నరేష్, జిల్లా నాయకులు కిషోర్, సునీల్, కమ్రుద్దీన్, జనార్దన్ పర్యవేక్షించారు.



విజేతగా నిలిచిన జేశాప్ జర్నలిస్ట్ జట్టు

ఆటో కార్మిక సంక్షేమానికి కృషి

నెల్లూరు (వైద్యం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆటో కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్ కిశోర్ తెలిపారు. ఆదివారం మూలాపేటలో నూతన ఆటోస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల బాధలను గుర్తించి వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ఏఐటీయూసీ నాయకుడు అంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, ఆటో కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు వాహనాల మధు, అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

స్టేడియంలో ఆరోగ్య శిబిరం

నెల్లూరు(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. అపోలో ఆసుపత్రి వైద్యుడు పీ రాజ మోహన్‌రెడ్డి అతిథిగా పాల్గొని ఆరోగ్య సూచనలు చేశారు. 60 ఏళ్లకు పైబడిన వారందరూ దీర్ఘకాలిక నొప్పులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం చేయడంతో కీళ్లు, మోకాళ్ల నొప్పులు దూరమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్ర రెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

నెల్లూరు రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్‌లోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కాకుపల్లి, మాదరాజు గూడూరు, కలివెలపాళెం, పెనుబర్తి గ్రామాల్లో చంద్రన్న పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించారు. ప్రతీ గ్రామంలో స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి ఆ మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సర్పంచ్ కోసూరు సుభాషిణి, నాయకులు ఈశ్వరయ్య, కేశవులు పాల్గొన్నారు.

'షైనింగ్ స్టార్'కు ముగ్గురి ఎంపిక

వెంకటాచలం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వీవీ రమణప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన పూజిత, హారిక, నందిని ఈ ఏడాది విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. దీంతో వారు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికయ్యారన్నారు. నెల్లూరు నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో కలెక్టర్ చేతులమీదుగా అవార్డులు అందుకోనున్నారని ఆయన పేర్కొన్నారు.

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి దర్గాలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాలతోపాటు రాష్ట్రం నలమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మస్తాన్ స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించగా, మరికొందరు అన్నదానం చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా దర్గాను పూలతో అలంకరించారు.

నిధుల దుర్వినియోగానికి అధికారులదే బాధ్యత

● బీజేపీ నాయకుడు రమేష్

నెల్లూరు (జడ్పీ), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పేదల ఇళ్ల పథకంలో కేంద్ర ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి అధికారులే సంపూర్ణ బాధ్యత వహించాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ హెచ్చరించారు. నగర పరిధిలోని వెంకటేశ్వరపురంలో ఉన్న ఏడవ లేఅవుట్‌లో కేంద్ర నిధులతో నిర్మించిన పేదల గృహాలు, మౌలిక సదుపాయాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆ ప్రాంతం గృహ నిర్మాణాలకు అనువైనది కాదని 2022 లోనే తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. అవినీతీ రుచి మరిగిన హౌసింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పనులు మొదలు పెట్టారని, ఈ క్రమంలో భారీగా నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించా రు. దీనిపై కలెక్టర్ స్థాయి అధికారితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, వెంకటేష్, నల్లగట్ల శ్రీహరి, అల్లూరు నాగేంద్ర సింగ్, సృజన, ఆదినారాయణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



పగుళ్లిచ్చిన ఇంటిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

జూలై నుంచి 'గడప గడపకు నూర్‌బాషా'

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నూర్‌బాషా (దూదేకుల) కుటుంబాల స్థితిగతులను అధ్యయనం చేసేందు కు గడప గడపకు నూర్‌బాషా కార్యక్రమాన్ని జూలైలో ప్రారంభిస్తున్నామని నూర్‌బాషా సంక్షేమం సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ సలీం తెలిపారు. ఆదివారం ఆచారివీధిలోని ఓ హోటల్‌లో ఆ సంఘం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గడపగడప కార్యక్రమంలో ప్రతీ నూర్‌బాషా ఇంటికి వెళ్లి వారి ఆర్థిక స్థితిగతులను నమోదు చేసి ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. విద్యార్థుల ప్రతిభ పురస్కారాల సభకు సహకరించిన డాక్టర్ షేక్ మస్తాన్ బాషా, సంఘం నాయకులను సత్కరించారు.



డాక్టర్ మస్తాన్‌బాషాను సత్కరిస్తున్న నూర్‌బాషా సంఘం నాయకులు

అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠకు శంకుస్థాపన

విడవలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దంపూరు గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠకు గ్రామ సర్పంచు సురేంద్రరెడ్డి ఆధర్యంలో ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు ఏటూరు హరిరెడ్డి, మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, ఈస్ట్రన్ చానల్ డీసీ ఛైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు దూది విజయరాఘవన్, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, పంచమూర్తి నారాయణలు, కొమ్మి శ్రీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

పొదలకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 500 కుపైబడి మార్కులు సాధించిన పద్మశాలీల విద్యార్థులకు ఆదివారం ప్రతిభ పురస్కారాలను అందజేశారు. పొదలకూరు పద్మశాలి మండల కమిటీ ఆధ్వర్యంలో కేఆర్‌నగర్‌లోని ఓ కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. పద్మశాలి మండల కమిటీ అధ్యక్షుడు చొప్పా వెంకటేశ్వర్లు, పూకోటి లక్ష్మీనారాయణ, పద్మశాలీల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతగింజల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని, తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీల రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాడ రాధయ్య, మండల కార్యదర్శి కారంపూడి మోహన్‌రావు, టీచర్ కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న విద్యార్థులతో పద్మశాలి నాయకులు

పర్యావరణాన్ని పరిరక్షించాలి

వెంకటాచలం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రతి ఒక్కరూ నాలుగు మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని జనసేన సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బీ. సురేష్‌నాయుడు తెలిపారు. సర్వేపల్లిలో ఆదివారం ఆయన నాయకులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి కుటుంబం బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటి వాటిని సంరక్షించి కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. భవిష్యత్తు తరాలను గుర్తుంచుకుని నేటితరం యువత మొక్కలు నాటి సమాజానికి మేలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణిభవాని, నేతలు పినిశెట్టి మల్లికార్జున్, పసుపులేటి ప్రసాద్, సందూరి శ్రీహరి, చెంచయ్య, మణి, షేక్ రహీమ్, అశోక్, సుమన్ పాల్గొన్నారు.

అఖిల భారత చెస్ పోటీల ప్రారంభం



చదరంగం పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నెల్లూరు(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఏపీ చెస్ అసోసియేషన్, ఎస్వీ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని నక్షత్ర పాఠశాలలో ఆదివారం అఖిల భారత చెస్ పోటీలు ప్రారంభమయ్యాయి. వీటిని ఇంటర్నేషనల్ మాస్టర్ బాలసుబ్రహ్మణ్యం, నక్షత్ర స్కూల్ డైరెక్టర్ జీ జీవన్‌కృష్ణ ప్రారంభించారు. తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి 234 మంది క్రీడాకారులు, ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి భారీగా క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో 66 మంది ఫిడే రేటింగ్ క్రీడాకారులతో పాటు ఇంటర్నేషల్ మాస్టర్, ఫిడే మాస్టర్స్, టైటిల్ క్రీడాకారులు ఉండటం విశేషం. ఆరు రౌండ్లు ముగిసే సరికి ఫిడే మాస్టర్ ప్రణవ్, ర్యాంకింగ్ క్రీడాకారులు శైలేష్, పవన్ తేజ, రామకృష్ణ ఆరేసి పాయింట్లతో ప్రథమ స్థానంలో, ఇంటర్నేషనల్ మాస్టర్ బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మీ, మహేశ్వరి, రిషి మనోహర్, కుషల్, భరత్ తదితరులు 5 పాయింట్లతో ద్వితీయ స్థానంలో కొనసాగుతున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ సంఘం కార్యదర్శి వై సుమన్, స్కూల్ డైరెక్టర్ కే సంధ్యారెడ్డి, టోర్నీ నిర్వాహకుడు ఎస్ వంశీ సుధాశ్రీ, ఆర్బిటర్స్ ఎం గోపీనాథ్, రామ్‌లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలపై పనిభారం తగ్గించాలి

● యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణమ్మ



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ

నెల్లూరు (వైద్యం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : దాదాపు 20 ఏళ్లుగా పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలతో సంబంధంలేని పనులు చేయించరాదని, ఆశాలపై పనిభారం తగ్గించాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆశాలకు కనీస వేతనం అమలు చేసి, పనిభద్రత కల్పించాలని ఆమె కోరారు. శిక్షణ లేకుండా గళ్ల పరీక్షలు, దీర్ఘకాలిక వ్యాధుల రిపోర్టుల తయారీ, పీహెచ్‌సీలను శుభ్రం చేయడం వంటి పనులు ఆశాలతో చేయించొద్దని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.


బీరు సీసాతో వ్యక్తిపై దాడి



గాయాలతో చికిత్స పొందుతున్న దర్గాబాబు

కావలి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగుతూ గొడవ చెయ్యవద్దన్నందుకు ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు బీరు సీసాతో దాడిచేసిన సంఘటన ఆదివారం కావలి పట్టణం జనతాపేటలో జరిగింది. బాధితుని కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొండాపురం మండలం సత్యవోలుకు చెందిన దర్గాబాబు స్నేహితులతో కలిసి పట్టణంలోని రామాలయం సమీపంలో ఒక రూమ్ అద్దెకు తీసుకుని ఉంటూ ప్రయివేట్ ట్రావెల్స్ బస్‌డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి డ్యూటీచేసి వచ్చిన దర్గాబాబు స్నేహితులతో కలిసి మధ్యాహ్నం రూమ్‌లో నిద్రపోయారు. ఈక్రమంలో పక్కరూమ్‌లో ఉంటున్న విద్యార్థులు తాళాలు వేసుకుని వారి గ్రామాలకు వెళ్లగా, గుర్తుతెలియని ఐదుగురు వ్యక్తులు వారి రూమ్ తాళాలు తీసుకుని మద్యం సేవిస్తూ పెద్దపెద్దగా అరుస్తుండడంతో పాటు రెండు రూమ్‌ల మధ్యన ఉన్న తలుపు కొడుతున్నారు. దీంతో నిద్రపోతున్నాము.. తలుపు కొట్టవద్దని దర్గాబాబు పలుమార్లు వారికి చెప్పినా వినకపోగా బీరు సీసా తీసుకుని అతని తలపై కొట్టారు. దీంతో గాయపడిన దర్గాబాబు వైద్యశాలకు వెళ్తుండగా రెండు మోటారు బైకులపై వెంబడించారని, ఆ సమయంలో తన ఫోన్‌లో వారిలో కొందరి ఫోటోలు తీసినట్లు బాధితుడు తెలిపాడు. రెండవ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దూడను ఢీకొన్న మోటారు సైక్లిస్టు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సందీప్

కావలి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి మోటారు బైక్‌పై అతి వేగంగా వెళ్తూ బర్రె దూడను ఢీకొన్న సంఘటన ఆదివారం కావలి మండలం కొత్తపల్లి వద్ద జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు పాటిబండ్ల ప్రసాద్ పశువులను ఇంటికి తోలుకుపోతుండగా కొండాపురం మండలం కొమ్మికి చెందిన బండ్లమూడి సందీప్ కావలి నుంచి కొమ్మికి బైక్‌పై వెళ్తూ బర్రె దూడను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దూడకు తీవ్ర గాయాలు కాగా, సందీప్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. సందీప్‌ను 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా, తన దూడ తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతోందని సుమారు రూ. 15వేలు నష్టపోయాయని రైతు వాపోయాడు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై వైద్యశాలలో చికిత్స పొందుతూ ఓ విద్యార్థి మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని విడవలూరుకు చెందిన ఎం వెంకట రమణయ్య, పార్వతి దంపతుల చిన్న కుమారుడు హనీష్ కార్తీక్(17) నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ఐటీఐ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 17వ తేదీ నుంచి ఉడ్ కాంప్లెక్స్‌లోని ఓ ఇంటీరియర్ ఫ్యాక్టరీలో వెల్డర్ విభాగంలో అప్రెంటీస్ చేస్తున్నాడు. గత నెల 30వ తేదీన వెల్డింగ్ పనులు చేస్తుండగా కార్తీక్ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఫ్యాక్టరీలోని వారు అతన్ని నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. హనీష్‌కార్తీక్‌కు బ్రెయిన్ డెడ్ అయిందని, బతకడం కష్టమని ఈ నెల 4వ తేదీ వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కార్తీక్‌ను ఇంటికి తీసుకెళ్లారు. అయితే బతికే అవకాశం ఉండొచ్చనన ఆశతో అదేరోజు జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. హనీష్ తండ్రి వెంకట రమణయ్య ఫిర్యాదుతో వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

600 గ్రాముల వెండి వస్తువుల చోరీ

నెల్లూరు(క్రైం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ఇరగాళ్లమ్మ సంఘానికి చెందిన సాయికుమార్ ఈ నెల 6వ తేదీ కుటుంబంతో కలిసి పెంచలకోనకు వెళ్లారు. అదే సమయంలో గుర్తుతెలియని దుండగులు వారి ఇంటి బెడ్‌రూమ్ కిటికీని పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలోని 600 గ్రాముల వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. శనివారం ఇంటికి చేరుకున్న సాయికుమార్ చోరీ జరిగినట్లు గుర్తించి ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు : తప్పిన ప్రమాదం

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): సంగం వైపు నుంచి బుచ్చికి వస్తున్న ఓ కారు స్థానిక టోల్‌గేట్ సమీపంలోకి వచ్చేసరికి టైరు పగలడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

అరచేతిలో ఆమె జీవితం !

● పరిచయం, ప్రేమ పేరుతో ఉచ్చులోకి.. ● వాట్సాప్‌లో తియ్యటి మెసేజ్‌లు ● వీడియో కాల్స్ చేయాలని ఒత్తిడి
● ఒక్కసారేనంటూ వలువలు విప్పించేస్తూ.. ● స్క్రీన్ రికార్డ్ చేసి బ్లాక్‌మెయిల్ ● బయటకు చెప్పుకోలేక నలుగుతున్న మహిళలు



నెల్లూరు(క్రైం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :


● నగరంలోని కరెంటాఫీసు సెంటర్ సమీపంలో ఓ కుటుంబం నివాసం ఉంటోంది. భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆ వివాహిత సమీప బంధువుతో కుటుంబ విషయాలను చెప్పుకుంటూ సన్నిహితంగా మెలిగేది. అతడి ప్రవర్తనలో మార్పు రావడాన్ని గమనించిన ఆమె అతన్ని దూరం పెట్టింది. దీంతో కోపోద్రిక్తుడైన ఆ వ్యక్తి తన కోర్కె తీర్చాలని ఆమెను కోరాడు. లేకుంటే తనతో తీసుకున్న ఫొటోలను పదిమందికి పంపి అల్లరి చేస్తానని బెదిరించాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో బంధువులకు పంపాడు. అతడి వేధింపులు తాళలేని భర్తతో కలిసి ఆమె వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

● కోవూరుకి చెందిన ఓ యువతిని అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటా నని మాయమాటలు చెప్పాడు. అతను మాటలు నమ్మిన యువతి ఇప్పుడు వివాహం చేసుకోమని కోరితే ఫోన్‌లోని వీడియోలు చూపించి బెదిరిస్తున్నాడు. న్యాయం చేయాలని ఆ యువతి ఇటీవల ఎస్పీ పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసింది.

...ఇలా చెప్పుకుంటూపోతే ఇలాంటి సంఘటనలు ప్రతినిత్యం జిల్లాలో ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. పరువు కోసం కొందరు బయటపడటంలేదు. మరికొందరు మాత్రమే బయటకు వచ్చి గళం విప్పుతున్నారు. సెల్‌ఫోన్ వచ్చాక ఆడవారి జీవితాల్లో అది నిప్పులు పోస్తున్నది. ఇందులో తప్పు ఎవరిదంటారా..? ఇరువైపులా తప్పులున్నా... చివరికి బలిఅయ్యేది మాత్రం అతివల జీవితాలే..

● వీడియో కాల్స్‌తో జీవితాలు నాశనం

సినిమాలు, సీరియల్స్, రీల్స్, సామాజిక మాధ్యమాల ప్ర భావమో.... చిన్న వయసులోనే ఆడ/మగపిల్లలు ప్రేమలో పడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా 13 ఏళ్ల పిల్లల నుంచి 50 ఏళ్ల దాటిన వారు సైతం ప్రేమలో మునిగి తేలుతున్నారు. చిన్న వయసు నుంచి పిల్లలకు ఫోన్ అందుబాటులో ఉండటంతో ఉదయం గుడ్‌మార్నింగ్ నుంచి రాత్రి గుడ్‌నైట్ వరకు నిత్యం ఫోన్‌తోనే కాలం గడుపుతున్నారు. అయితే అంతటితో ఆగకుండా సమయం దొరికినప్పుడల్లా వాట్సాప్‌లో చాటింగ్ చేసుకోవడం సాధారణమైంది. ఇంకొందరు ఇంట్లో ఎవరూ లేని సమయంలో, బెడ్‌రూమ్‌లో ఒక్కరే ఉన్నప్పుడు, బాత్‌రూమ్‌లలో వీడియోకాల్స్ మాట్లాడుకోవడం మామూలైపోయింది. అయితే అది కాస్తా శృతిమించి వాట్సాప్ కాల్స్‌లో దుస్తులు విప్పుతూ న్యూడ్‌కాల్స్ మాట్లాడుకోవడం ప్రారంభమైంది. వద్దు వద్దు.. అంటూ బాలికలు, యువతులు, మహిళలు ఎన్నో రోజులు వీడియోకాల్స్‌లో దుస్తులు విప్పకుండా జాగ్రత్త పడుతున్నా.. తియ్యటి మాటలు, గంటల తరబడి 'నీ కాళ్లు పట్టుకుంటా.. నీకు ఏమి కావాల్నో చెప్పు ఇస్తా.. ప్లీజ్... బుజ్జి, బంగారం, లక్కీ.. అంటూ అబ్బాయిలు బతిమ లాడుతుండటంతో ఏదో ఒక సమయంలో చేయకూడని తప్పు చేసేస్తున్నారు. వీడియో కాల్స్‌లో దుస్తులు విప్పి న్యూడ్‌గా మాట్లాడుతున్నారు.



● రికార్డు చేసి బెదిరింపులు

కొందరు వ్యక్తులు మహిళలతో న్యూడ్ వీడియో కాల్‌లో మాట్లాడించేందుకు నెలల తరబడి తియ్యటి మాటలు చెప్తూ చివరిగా వారు అనుకున్నది చేస్తారు. వీడియో కాల్స్‌ను, వాట్సాప్ మెసేజ్‌లలో వచ్చిన ఫొటోలను జాగ్రత్తగా రికార్డు చేసుకుంటారు. ఆ తర్వాత తమతో శారీరకంగా కలవాలని ఒత్తిడి చేస్తారు. అందుకు ఆ మహిళ ఒప్పుకోకపోతే ఒక్కో వీడియోకాల్స్ రికార్డును బయటకు తీసి చూపిస్తారు.తాను చెప్పినట్లు వినకుంటే వీడియోలు బయట పెడతానని బెదిరిస్తున్నారు. దీంతో ఎవరికీ చెప్పుకోలేక ఆ మహిళలు బలై పోతున్నారు.

● పర్యవేక్షణ అవసరం

న్యూడ్ వీడియో కాల్స్ మాట్లాడి మృగాల చేతిలో చిక్కుతున్న ఎంతోమంది అమ్మాయిలు తల్లిదండ్రులకు చెప్పుకుందామంటే వారు ఆత్మహత్యలకు పాల్పడతారని, స్నేహితులకు చెప్పుకుందామంటే.. ఇలాంటి పనులు చేసేదానివా..? అని తేలిగ్గా చూస్తారని, పోలీసులకు ఫిర్యాదు చేద్దామంటే ఇక సమాజంలో అందరికీ తెలిసిపోతుందని... ఇలా ఎన్నో ప్రశ్నలతో ఆ సమస్య నుంచి బయట పడలేకపోతున్నారు. ఈ క్రమంలో కొంతమంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

ఫిర్యాదు చేయండి... వివరాలు గోప్యంగా ఉంచుతాం



ఎవరైనా బయటకు చెప్పుకోలేని సైబర్ నేరాల బారిన పడి నష్టపోతుంటేనో... లేక వేధింపులకు గురవుతుంటేనో.. సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. మీ వివరాలను గోప్యంగా ఉంచి విచారణ చేపడతాం. శక్తి టీమ్‌లు మీకు అండగా ఉంటాయి. అవసరమైతే నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వీడియో కాల్స్ మాట్లాడే సమయంలో ప్రతి మహిళ జాగ్రత్తగా ఉండాలి.

-సీహెచ్ సౌజన్య, ఏఎస్పీ

నేడు వెంగమాంబ హుండీల లెక్కింపు

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో వెలసి ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హుండీలను సోమవారం లెక్కిస్తారు. దేవదాయ, ధర్మదాయశాఖ అధికారుల పర్య వేక్షణలో లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కోనలో శ్రీవారికి గరుడసేవ



స్వర్ణ గరుడుడిపై స్వామివారు

రాపూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : స్వాతి నక్షత్రం పురస్కరించుకుని ఆదివారం విశేష కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున శ్రీవారికి చందనాలంకారసేవ, అభిషేకాలు నిర్వహించి కల్యాణ మండపంలో కొలువుదీర్చి శాంతిహోమం చేశారు. అనంతరం స్వర్ణగరుడ వాహనంపై కొలువుదీర్చి ఆస్థానసేవ నిర్వహించారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు, అన్నప్రసాదం అందించినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

దేవరపాళెంలో పేకాట రాయుళ్ల అరెస్ట్

నెల్లూరు రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దేవరపాళెం గ్రామం ఐఎంఎల్ డిపో (మద్యం నిల్వ గోదాము) వెనుక పేకాట ఆడుతున్న జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. ముందస్తు సమాచారంతో ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేసి, 8 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ. 17,500 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

కావలి రూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని కావలి జీఆర్పీ ఎస్ఐ రమాదేవి పేర్కొన్నారు. రైల్వే ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఆదివారం సాయంత్రం బాంబ్, డాగ్ స్క్వాడ్ సిబ్బందితో ఆమె తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైళ్లల్లో నిషేధిత వస్తువులు తరలించినా, డ్రగ్స్, గంజాయి వంటి వాటిని తరలిస్తూ చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా కఠినచర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. అనంతరం స్టేషన్‌లోని ప్యాసింజర్ బ్యాగులు, బుకింగ్, పార్సిల్ కార్యాలయాలు స్టాళ్లతోపాటు రైళ్లల్లో తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాగ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో అవకతవకలకు అడ్డుకట్ట వేయాలి

● ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి ● ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్
● జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముట్టడి



విద్యాశాఖ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో ఉపాధ్యాయులు

నెల్లూరు(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులు, బదిలీల్లో అవకతవకలకు అడ్డుకట్ట వేయాలని, ఎస్‌జీటీలకు బదిలీలను మాన్యువల్ పద్ధతిలో నిర్వహించాలని ఉపా ధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా విద్యా శాఖ కార్యాలయాన్ని ఆదివారం వారు ముట్టడించారు. ప్రధానోపాధ్యా యులు, ఎస్ఏల వెబ్ కౌన్సెలింగ్ తప్పుల తడకగా నిర్వహించారన్నారు. క్లస్టర్ వేకెన్సీలను ఎక్కువగా పాయింట్లు వచ్చిన వారికి కేటాయించడం దుర్మార్గపు చర్య అన్నారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీ ఉపాధ్యాయులు జనరల్ కేటగిరీలోకి వచ్చి ఆప్షన్లు పెట్టుకున్నప్పటికీ వారికి స్థానాలు కేటాయించకపోవడం అన్యాయమని విమర్శించారు. ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు ఆన్‌లైన్‌లో చేయలేక మాన్యువల్‌గా చేశారని, పనిచేయని సాఫ్ట్‌వేర్లతో ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. బాలికోన్నత పాఠశాలలకు పురుషులను కేటాయించడం వంటి తీవ్రమైన పొరపాట్లు జరిగాయన్నారు. పూర్తిగా విఫలమైన ఈ వెబ్ కౌన్సెలింగ్ విధానాన్ని ఎస్‌జీటీల మీద బలవంతంగా రుద్దడం సరికాదని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు కలసి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చించాలని కోరారు. ఈ ముట్టడి కార్యక్రమంలో ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఏ సురేంద్రరెడ్డి, నాయకులు అనిల్, చలపతిశర్మ, నరసింహులు, హజరత్, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రావు, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచి మృతి

సంగం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నవరపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచి ముత్యాల కోటయ్య (63) వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కోటయ్య మోటారు బైక్‌పై వెళ్తూ శనివారం రాత్రి సంగం - కలిగిరి రహదారిలో ఎర్రచెరువు సమీపంలో ఆర్బీ వద్ద గేదెలను ఢీకొన్న సంఘటనలో తీవ్రగాయాలవడంతో చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయన 2008 -13వ సంవత్సరం వరకు చెన్నవరపాడు సర్పంచ్‌గా పని చేశారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు గంగపట్నం చంద్రశేఖరయ్య, పలువురు టీడీపీ నాయకులు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

ప్రమాదవశాత్తు వ్యక్తికి గాయాలు



ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజు మండేల్

సీతారామపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పోరుమామిళ్ల ఘాట్ రోడ్డు మార్గంలో జరుగుతున్న భారతమాల ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా రాడ్ వెల్డింగ్ పనులు చేస్తున్న ఓ కార్మికుడికి ఆదివారం తీవ్ర గాయాలయ్యాయి. వెస్ట్ బెంగాల్‌కు చెందిన రాజు మండేల్ అనే కార్మికుడు వెల్డింగ్ పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఇనుప చువ్వ ప్రమాదవశాత్తు కుడి కన్నుకు బలంగా తగిలింది. దీంతో కంటికి తీవ్ర రక్తస్రావం కావడంతో సహచర కార్మికులు రాజు మండేల్‌ను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఉదయగిరికి తరలించారు.

నేడు ట్రెజరీలో దిగువ స్థాయి ఉద్యోగుల బదిలీలు

● అధికారులపై ఒక వర్గం ఒత్తిడి? ● జోరుగా పైరవీలు!



జిల్లా ట్రెజరీ కార్యాలయం


నెల్లూరు(హరనాథపురం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సోమవారం అటెండర్ స్థాయి నుంచి సీనియర్ అకౌంటెంట్ స్థాయి వరకు ఉద్యోగుల బదిలీల ప్రక్రియ జరుగనుంది. ట్రెజరీలో రెండు ఉద్యోగ సంఘాలు ఉన్నాయి. ఆ రెండింటికీ గుర్తింపు లేకపోయినప్పటికీ తమదే గొప్ప యూనియన్‌గా చెప్పుకొంటున్న ఒక సంఘం నాయకులు అధికారుల మీద తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి తమకు అనుకూలమైన వారిని బదిలీ చేయించుకోవడానికి పావులు కదుపుతున్నట్లు సమా చారం. పైరవీలు చేస్తున్న యూనియన్ నాయకులు, రోసా రూల్స్‌ను అతిక్రమించినట్లు ఆరోపణలున్నాయి. మరణించిన, పదోన్నతి పొందిన వారి స్థానంలో అడ్డగోలుగా కోఆప్షన్ పద్ధతిలో కొందరిని తీసుకొని బదిలీలకు అవకాశం కల్పించినట్లు తెలిసింది. ఈ వ్యవహారం వెనుక ఇప్పటికే పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం జరిగే బదిలీల ప్రక్రియలో అధికారులు నిబంధనలు పాటిస్తారో.. లేదో చూడాలి.

పులి వాహనంపై చాముండేశ్వరి దర్శనం



ఇందుకూరుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగపట్నంలో చాముండేశ్వరిదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పులి వాహనంపై అమ్మవారు కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో తాతా శ్రీనివాసరావు, గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



పొదలకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరులో ఆదివారం సాయంత్రం హనుమాన్ శోభాయాత్ర ఘనంగా జరిగింది. రాంనగర్ గేట్ సెంటర్ నుంచి ప్రారంభమైన యాత్ర పంచాయతీ బస్టాండ్ మీదుగా నెల్లూరురోడ్‌లోని కేఆర్‌ఆర్ కాలనీ వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగింది. హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రకు స్వాగతం పలుకుతూ హిందువులు మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీరాముడు, హనుమాన్ విగ్రహాలు ఆకట్టుకున్నాయి. జై శ్రీరామ్... జై హనుమాన్ నినాదాలతో పట్టణం మారుమోగింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ హనీఫ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

కిలో (రూ.లలో)	
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 540

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర రూ.9249

వెండి కిలో ధర రూ. 108500

వెండి ఒక గ్రాము రూ.111.50

రక్తదానంతో రోగిని కాపాడిన యువకుడు

కందుకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ నిమిత్తం ఒక రోగికి అరుదైన ఏ-నెగిటివ్ బ్లడ్ గ్రూపు అత్యవసరం అయింది. దీంతో ఆదివారం బ్లడ్ డోనర్స్ వాట్సప్ గ్రూప్‌లో చూసిన కందుకూరు పట్టణం ప్రకాశం కాలనీకి చెందిన ఉప్పుటూరి వంశీ విజయవాడకు వెళ్లి రక్తదానం చేసి రోగి నిండుప్రాణం కాపాడాడు. దీంతో అతని బంధువులు వంశీకి కృతజ్ఞతలు తెలిపారు. కందుకూరు రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ చైర్మన్ చన్నా వెంకట రామాంజనేయులు అభినందించారు.

న్యూస్ బాక్స్

అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కలిగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సెంటర్ వద్ద అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం భక్తులు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ గతంలో ఉన్న ఆలయం రహదారి విస్తరణలో కోల్పోతున్న సందర్భంలో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామి భక్తులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



వీఆర్ కోటలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్నసభ్యులు

లింగసముద్రం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగద్గీత గురించి తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవాసమితి దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు జి ప్రసాద్ సూచించారు. ఆదివారం మండలంలోని వీఆర్ కోట గ్రామంలో కమిటీ సభ్యులతో కలిసి ఆయన త్రైత సిద్ధాంత భగద్గీత గురించి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి కమిటీ సభ్యులు జి సుధాకర్, కె నరసింహులు, ఎం నాగమ్మ, వి మహేంద్ర, డి మధు, వి కొండలరావు, కె వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో అల్లాడుతున్న జనం

లింగసముద్రం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వారం రోజుల నుంచి ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉండడం, 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలకు భయపడి ఉదయాన్నే ప్రజలు దుకాణా లకు వెళ్లి సరుకులు తీసుకొని 11 గంటలకే ఇళ్లకు వెళ్లిపోతున్నారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి, చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తా

● నా గెలుపు కోసం కష్టపడిన ఏ ఒక్కరినీ వదులుకోను ● కూటమి ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే మున్సిపల్ ఎన్నికలలో 40కి 40 వార్డులు గెలుచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇచ్చేందుకు కృషి చేస్తున్నానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలతో ఆదివారం కావలి పట్టణ ఎంజీఆర్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్ చిత్రపటాలకు ఎమ్మెల్యేతో పాటు నేతలు పాలాభిషేకం చేశారు. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన బీసీ నేత జనిగర్ల మహేంద్రయాదవ్, మరో ఐదుగురు వైసీపీ వార్డు ఇన్‌చార్జిలు భారీ ర్యాలీగా సమావేశం వద్దకు వచ్చి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలికి చెందిన బీసీ నేత మహేంద్ర యాదవ్ వారి అనుచరులను, దగదర్తికి చెందిన తాళ్లూరు ప్రసాద్‌నాయుడు వారి అనుచరులను కేంద్ర పార్టీ అనుమతి మేరకు త్వరలో మంత్రుల సమక్షంలో కావలిలో పెద్ద సమావేశం ఏర్పాటుచేసి టీడీపీ లో చేర్చుకోవటం జరుగుతుందన్నారు. తాను కష్టాలలో ఉన్నపుడు చిన్న సహాయం చేసిన ఎవరినీ మరిచిపోనని, కష్టపడి గెలిపించిన ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తానన్నారు. కూటమి గెలుపు కోసం పనిచేసిన బీజేపీ, జనసేన వారిని కూడా కలుపుకుపోయి వారికి కొన్ని సీట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. అందులో భాగంగానే ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం, టీడీపీలోకి వచ్చేవారిని పార్టీలో చేర్చుకోవడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నానన్నారు. తనను నమ్మి చంద్రబాబునాయుడు, లోకేష్‌లు టిక్కెట్ ఇచ్చారని, వారి రుణం తీర్చుకునేందుకు లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేసే వరకూ తాను శ్రమిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూరావు, పోతుగంటి అలేఖ్య, గుంటపల్లి రాజకుమార్ చౌదరి, పోట్లూరు శ్రీనివాసులు, కండ్లగుంట మధుబాబు నాయుడు, అమరా వేదగిరి, మాలేపాటి నాగేశ్వరరావు, ఆవుల రామకృష్ణ, బండి శ్రీనివాసులురెడ్డి, శ్రీహరినాయుడు, బీజేపీ నేతలు గుండ్లపలి భరత్‌కుమార్, కే బ్రహ్మానందం, జనసేన నేతలు పొబ్బా సాయి విఠల్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

అనారోగ్య కారణాల వలన వివిధ ఆసుపత్రులలో చికిత్స పొంది సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 29 మంది లబ్ధిదారులకు రూ.25,80,418 చెక్కులను ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆత్మీయ సమావేశం అనంతరం పంపిణీ చేశారు.

అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై
చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
పోలీస్‌స్టేషన్‌లో తెలుగు మహిళల ఫిర్యాదు



కందుకూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

కందుకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని అమరావతిపై, అక్కడి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి ఛానల్ ప్రతినిధులు, జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని ఆదివారం తెలుగు మహిళల ఆధ్వర్యంలో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాంబశివరావుకు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతి దేవతల రాజధానిగా వ్యాఖ్యానించగా జీర్ణించుకోలేని వైకాపా నేతలు, సాక్షీ ఛానల్ డిబేట్‌లో కృష్ణంరాజు అనే జర్నలిస్టు అమరావతి వేశ్యల రాజధాని అని సంబోధించడం, సాక్షి ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావు యధావిధిగా డిబేట్‌ను కొనసాగించడం మహిళలను అవమానించడమేనని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సాక్షి ఛానల్, జర్నలిస్టులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు ఇచ్చినవారిలో పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ, మహిళా నాయకులు రసూల్‌బీ, ఎస్తేరమ్మ, పార్వతి, రత్తమ్మ తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మహాలక్ష్మి

కావలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిం చారు. వైద్యనిపుణులు మహాలక్ష్మీ ఆధ్వర్యం లో పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మందులు పంపణీ చేశారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ ఏవో కృష్ణ గల్లా, అరవింద నేత్రాలయ సిబ్బంది వాసుదేవరెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతి నిధు లు డీ రవిప్రకాష్, కే హరినారపరెడ్డి, మధుసూధనరావు, మోడరన్ నరసింహం పాల్గొన్నారు.

పైపులైన్ పగిలి వృథాగా పోతున్న మంచినీరు



పైపులైన్ పగిలి వృథాగా పోతున్న మంచి నీరు

లింగసముద్రం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని వాకమళ్లవారిపాలెం ఆనకట్ట పక్కనే ఉన్న అంతర్గత మంచినీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. మూడు రోజుల క్రితం ఈ ఆనకట్ట పక్కనే ఉన్న చిల్లచెట్ల మొద్దులు ఎక్స్‌కవేటర్‌తో తీస్తుండగా బకెట్ తగిలి మంచినీటి పైపులైన్ పగిలి పోయింది. దీంతో నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన వేసవి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం



అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మహేంద్రను సన్మానిస్తున్న బీఎంఆర్ ట్రస్ట్ సభ్యులు.

బిట్రగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఉచిత ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఫుట్‌బాల్ సీనియర్ కోచ్ ఎస్‌ప నవీద్ పర్యవేక్షణలో బీఎంఆర్ ట్రస్ట్ సౌజన్యంతో విద్యార్థులకు ఫుట్‌బాల్ క్రీడా దుస్తులు, షూస్ అందచేశారు. ఈ కార్యక్రమానికి బిట్రగుంట సీనియర్ క్రీడాకారుడు, అంతర్జాతీయ ఫుట్‌బాల్ ప్లేయర్ మహేంద్ర (మను)ను ముఖ్య అతిథిగా ఆహ్వానించి సన్మానించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు బర్నాడ్, గౌరవ అధ్యక్షుడు స్పర్జన్ రాజ్, బీఎంఆర్ యువసేన సమీఉల్లా, సీనియర్ క్రీడాకారులు మార్క్, సునీల్, గౌస్, అశోక్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగాసనాలు వేయిస్తున్న యోగా గురువు అరుణరెడ్డి

బిట్రగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం చేకూరుతుందని ప్రభుత్వ వైద్యుడు కొర్రా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో యోగా గురువు అరుణరెడ్డి యోగాపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆసనాలు వేయడం వలన శరీర పటుత్వంతో పాటు ఆరోగ్యం చేకూరుతుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు బీ బర్నాడ్, మాజీ గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్ యాదవ్, కమిటీ సభ్యులు మన్నెం శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు కే శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌చార్జి లైబ్రేరియన్ శ్రీనివాసరాజు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

ఆత్మకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విశ్రాంత గ్రంథ పాలకులు ఏ గోవిందరెడ్డి, మేధా హైస్కూల్ కరస్పాండెంట్ టీసీవీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకున్న విద్యార్థులను అభినందించారు. గ్రంథాలయం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం స్టోరీ టెల్లింగ్, పేపర్ క్రాఫ్, డ్రాయింగ్ తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): అనంతసాగరం శాఖా గ్రంథాలయంలో 40 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై ప్రతిభా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రభాకర్‌రెడ్డి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, గ్రంథాలయాధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రూ. 5 లక్షలతో సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన



సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జనసేన నాయకులు

సంగం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధీపురం మజరా అనసూయనగర్ గ్రామంలో శనివారం జనసేన నాయకులు సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని సిమెంట్ రోడ్డుకు రూ. 5 లక్షలు ఉపాధి హామి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను కూటమి ప్రభుత్వంలోని జనసేనకు కేటాయించడంతో ఆ పార్టీ నాయకులు దాడిబాను కిరణ్ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తిరుమలేష్, శ్రీధర్, వరకుమార్, హరీష్, నరసింహ పాల్గొన్నారు.

చెట్టంత నిర్లక్ష్యం...



చేదుడు బావిలో ఏపుగా పెరిగిన చెట్టు

ఉదయగిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో కనిపిస్తున్న చెట్టుకు చుట్టూ గోడ కట్టినట్లు కనిపిస్తోంది కదూ.. అది ఉదయగిరి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న చేదురు బావి. ఏళ్ల తరబడి ఈ బావి పంపింగ్ స్కీం ద్వారా పట్టణంలోని పలువురికి నీటి అవసరాలు తీర్చుతోంది. అయితే దీని లోపల చిన్నగా ఉన్న పనికి రాని మొక్క పెరిగి పెద్దదై ఇప్పు డు చెట్టుగా మారింది. ప్రారంభంలోనే దీనిని తొలగించకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలి మరీ...



నాగారపమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు

నాగారపమ్మదేవికి ప్రత్యేక పూజలు

సంగం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసి ఉన్న పురాతన నాగారపమ్మదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూలంకరణ ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

హంసవాహనంపై సరస్వతిదేవి అలంకారంలో ఆత్మారామస్వామి



హంస వాహనంపై దర్శనమిస్తున్న ఆత్మారామస్వామి

సంగం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో వెలసి ఉన్న ఆత్మారామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి హంసవాహనంపై సరస్వతీదేవి అలంకారంలో ఆత్మారామస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆత్మారామస్వామి ఉత్సవ విగ్రహాన్ని సరస్వతీదేవి అలంకారంలో హంస వాహనంపై గజపూలమాలలతో అలంకరించారు. అనంతరం గ్రామోత్సవంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఈ గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత కంటి పరీక్షలు



మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

మర్రిపాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా త్వరలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసి అద్దాలు అందించనున్నట్లు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మర్రిపాడు మండలం నాగరాజుపాడులో ఆదివారం జరిగిన కోదండరామస్వామి, తిమ్మయ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఎంపీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలను ఇచ్చే కార్యక్రమాన్ని నాగరాజుపాడు నుంచి ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఆరికట్ల జనార్ధన్ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు గంగాధర్, మాజీ అధ్యక్షులు శాఖమూరి నారాయణ, భీమవరం సొసైటీ చైర్మన్ చిన్నాకెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అంకాళమ్మతల్లి

గ్రామదేవతకు పొంగళ్లు

ఉదయగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.చెరువుపల్లి గ్రామంలో ఆదివారం గ్రామదేవతైన అంకాళమ్మతల్లికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్ల సామగ్రిని నూతన బుట్టల్లో ఉంచి గ్రామ పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో గ్రామం సమృద్ధిగా ఉండాలని పూజలు చేశారు.

వైభవంగా అడవిపేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉదయగిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో వెలసి ఉన్న శ్రీఅడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు ఆదివారం గడ్డంవారిపల్లి గ్రామం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత మిట్టపల్లి గ్రామం నుంచి గొడుగుల ఉత్సవం మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గడ్డంవారిపల్లి రామాలయానికి చేరుకుంది. వేదపండితులు అమ్మవారికి గణపతి పూజ, పుణ్యా హవచనం, అభిషేకాలు, విశేష అలంకరణలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పంచాయతీతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు యోగాంధ్ర ర్యాలీ

ఆత్మకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారం ఉదయం 8 గంటలకు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించబడుతుందని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి వెంబడి కొనసాగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



అనంతసాగరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద వెలసి ఉన్న ప్రముఖ సోమేశ్వరాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సోమసుందరమూర్తి, విజయకుమార్, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి బంగారు కాసులపేరు బహూకరణ



అమ్మవారికి బంగారు కాసులపేరును అందజేస్తున్న భక్తులు

ఉదయగిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిపేరంటాలమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా పంచాయతీలోని అన్ని గ్రామాల ప్రజలు 176 గ్రాముల బంగారు కాసులపేరు మాల బహూకరణ చేశారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు మేళతాళాల నడుమ కాసుల పేరు, కాసులను ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



భక్తజనసంద్రం.. ముక్కంటి ఆలయం


శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. వారాంతపు, వేసవి సెలవులు రావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచీ భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేల మంది దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 663 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,046, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,761 మంది దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,878 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,391, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 471, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 310, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 138 మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,473 విక్రయించినట్లు అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



తెప్పంపై సుందరరాజస్వామి రాజసం

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి పద్మసరోవరంలో తెప్పపై విహరించారు. సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవర్లను పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేసి తెప్పపై కొలువు దీర్చారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఉభయదేవేరిలతో స్వామివారు పద్మపుష్కరిణిలో మూడు చుట్లు తిరిగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్ నాయుడు, అర్చకులు పాల్గొన్నారు.



- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



రద్దీగా తిరుపతి రైల్వే స్టేషన్

తిరుమలకు వచ్చే భక్తులు.. వేసవి రద్దీ కలిపి తిరుపతి రైల్వే స్టేషన్ ప్రాంగణం, సాధారణ విశ్రాంతి హాలులో ప్రయాణికుల సందడి ఎక్కువైంది. రోజువారీగా తిరుపతి మీదుగా 90 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక, తిరుమలకు పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా తిరుపతి మీదుగా నెలకు 60 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నా రద్దీ తగ్గడంలేదు. అన్ని రైళ్లలో సామర్థ్యం కంటే మించి.. వెయిటింగ్ లిస్ట్‌లో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో అదనపు కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నామని అధికార వర్గాలు వెల్లడించాయి.

- తిరుపతి(సెంట్రల్), ఆంధ్రజ్యోతి

మన ఆణిముత్యాలు



ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా యూజీ కోర్సుల్లో ప్రవేశాలకోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు ఆదివారం సాయంత్రం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలు ప్రైవేటు జూనియర్ కళాశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.

- తిరుపతి(విద్య)

● ఏపీ ఈఏపీసెట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



భానుచరణ్‌రెడ్డి, మణిదీప్‌రెడ్డి, బీవీ ధనుష్, యశ్విత, ఒ. ఆరుష్ లక్ష్మణ్, మెడిసిన్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 45వ ర్యాంకు, ఎ.మౌనిక

ఐఐటీ ముంబైలో చదువుతా

తిరుపతి ఎస్వీ నగర్‌కు చెందిన కెమిస్ట్రీ అధ్యాపకుడు కె.నాదమునిరెడ్డి, ఎం.బిందు దంపతుల కుమార్తె కళత్తూర్ యశ్విత ఈఏపీసెట్‌లో 69వ ర్యాంకు సాధించారు. తిరుపతి నారాయణ కళాశాలలో ఇంటర్ చదివిన ఈమె జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయి ర్యాంకు 1535, ఈడబ్ల్యుఎస్‌లో 122వ ర్యాంకు, అడ్వాన్స్‌డ్‌లో ఓపెన్ కేటగిరీలో 906వ ర్యాంకు, ఈడబ్ల్యుఎస్ కేటగిరీలో 67వ ర్యాంకు పొందారు. ముంబై ఐఐటీలో సీఎస్ఈ చదవాలనేది తన ఆశయమని, ఆమేరకు జేఈఈ ద్వారా చేరనున్నట్లు చెప్పారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌లో రీసెర్చ్

తిరుపతి ఎం.ఆర్.పల్లె అమరావతి నగర్‌కు చెందిన ప్రైవేట్ అధ్యాపకుడు (గణితం) ఎం.జైభారత్‌రెడ్డి, ప్రైవేట్ ఉపాధ్యాయురాలు సురేఖ దంపతుల కుమారుడు మాండవ్యపురం భానుచరణ్‌రెడ్డి తిరుపతి నారాయణ కళాశాలలో ఇంటర్ చదివారు. ఏపీ ఈఏపీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన ఇతడు.. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయిలో 51వ ర్యాంకు, ఈడబ్ల్యుఎస్ కేటగిరీలో జాతీయ స్థాయిలో 4వ ర్యాంకు, జేఈఈ మెయిన్స్‌లో ఓపెన్ ర్యాంకు 158, ఈడబ్ల్యుఎస్‌లో 7, జేఈఈ బీఆర్క్‌లో ఓపెన్ కేటగిరీలో 54, ఈడబ్ల్యుఎస్‌లో 3వ ర్యాంకు సాధించారు. ముంబై ఐఐటీలో బీటెక్ చదివి, ఆ తర్వాత క్వాంటమ్ కంప్యూటింగ్‌లో రీసెర్చ్ చేయాలన్నది తన ఆశయమని భానుచరణ్‌రెడ్డి తెలిపారు.

న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో మెడిసిన్

తిరుపతిలోని ఆర్థో డాక్టర్ కిరణ్, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ శైలజ దంపతుల కుమారుడు ఒ.ఆరుష్ లక్ష్మణ్ ఈఏపీ సెట్ మెడికల్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 45వ ర్యాంకు సాధించారు. తిరుపతిలోని శ్రీచైతన్యలో ఇంటర్ చదివిన ఈయన.. న్యూఢిల్లీలోని ఆలిండియా మెడికల్ సైన్సెస్‌లో మెడిసిన్ చదవాలన్నది తన ఆశయమని చెప్పారు. అందుకోసమే నీట్ రాశానని, ఆ ఫలితాలు వెలువడిన తర్వాత తదుపరి కార్యాచరణను రూపొందించుకుంటానని ఆరుష్ తెలిపారు.

టాప్ 7 ఐఐటీల్లో బీటెక్

శ్రీకాళహస్తిలో సబ్‌ట్రెజరరీ అధికారిగా పనిచేసే, ఎం.ఆర్.పల్లెకు చెందిన సి.వెంకటరమణ, ప్రభుత్వ టీచరు సి.విజయ దంపతుల కుమారుడు బీవీ ధనుష్ ఏపీ ఈఏపీ సెట్‌లో 59వ ర్యాంకు సాధించారు. తిరుపతి నారాయణ కళాశాలలో ఇంటర్ చదివిన ఇతడు జేఈఈ మెయిన్స్‌లో 466 ర్యాంకు, అడ్వాన్స్‌డ్‌లో 1208 ర్యాంకు పొందాడు. టాప్ 7 ఐఐటీల్లో బీటెక్ సీఎస్ఈ చదవాలన్నది తన కోరికని, వాటిల్లో సీటు కోసం ప్రయత్నిస్తానని ధనుష్ చెప్పారు.

ఎస్వీ మెడికల్ కళాశాలలో మెడిసిన్

తిరుపతి అమరావతినగర్‌లోని హేమంత్‌కుమార్ (చంద్రగిరి హెడ్ పోస్టాఫీస్ పోస్టల్ అసిస్టెంట్), శ్రీలత దంపతుల కుమార్తె ఎ.మౌనిక నారాయణ కళాశాలలో ఇంటర్ చదివారు. ఈఏపీ సెట్ మెడికల్ విభాగంలో 94వ ర్యాంకు సాధించారు. నాన్న డాక్టర్ అవ్వాలనుకున్నప్పటికీ పరిస్థితుల కారణంగా కాలేకపోయారని, దీనిని వింటున్న తనలో డాక్టర్ కావాలనే పట్టుదల పెరిగిందని ఆమె చెప్పారు. ఆమేరకు తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో మెడిసిన్ చదువుతానని చెప్పారు. తాను ఇటీవల నీట్ రాశానని, అందులో మంచి ర్యాంకు వచ్చినప్పటికీ తిరుపతిలోనే చదవాలనుకుంటున్నట్లు మౌనిక వెల్లడించారు.

ఖరగ్‌పూర్ ఐఐటీలో సీఎస్ఈ

తిరుపతి విద్యానగర్ గౌతం నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గిరిజాప్రసాద్‌రెడ్డి, అగ్రికల్చరల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ అమరావతి దంపతుల కుమారుడు దేశిరెడ్డి మణిదీప్‌రెడ్డి ఈఏపీసెట్ ఇంజినీరింగ్ విభాగంలో 7వ ర్యాంకు సాధించారు. తిరుపతి నారాయణ కళాశాలలో ఇంటర్ చదివారు. జేఈఈ మెయిన్స్‌లో 274, అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో 345వ ర్యాంకు సాధించాడు. జేఈఈ ర్యాంకు ద్వారా ఖరగ్‌పూర్ ఐఐటీలో సీఎస్ఈ చదవాలన్నది తన ఆశయమని మణిదీప్‌రెడ్డి చెప్పారు.

ఇంజినీరింగ్ విభాగంలో అగ్రగణ్యులు

తిరుపతికి చెందిన భానుచరణ్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించి జిల్లాల్లో అగ్రగణ్యుడిగా నిలిచారు. అలాగే మణిదీప్‌రెడ్డి 7వ ర్యాంకు సాధించి జిల్లాలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఆరుష్ లక్ష్మణ్ 45, ధనుష్ 59, యశ్విత 69వ ర్యాంకుతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఇక, అరుణ్‌కుమార్ రెడ్డి 125, యశ్వంత్ 135, లావణ్య 230, లక్ష్మీసహస్ర 322, జెశ్విత 398, జాశ్విత 444, శివకృతిక్ 492 ర్యాంకులు సాధించారు. వీరిలో కొందరికి జేఈఈలోనూ మంచి ర్యాంకులు వచ్చాయి.

● బైపీసీ విభాగంలో తిరుపతికి చెందిన ఒ.ఆరుష్ లక్ష్మణ్ రాష్ట్రస్థాయిలో 45, చంద్రగిరికి చెందిన మౌనిక 94వ ర్యాంకు సాధించి జిల్లా టాపర్లుగా నిలించారు.



పరిశ్రమకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

'దమ్ము బయోఫ్యూయల్స్'కు భూమిపూజ

పెళ్లకూరు,జూన్8(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం పాలచ్చూరులో ఆదివారం దమ్ము బయోఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు ఎమ్మెల్యే భూమి నెలవల విజయశ్రీ భూమిపూజ చేశారు. 22.49 ఎకరాల్లో రూ. 229.82 కోట్లతో 200 కేఎల్‌పీడీ (100 శాతం ఇథనాల్) ధాన్యం ఆధారిత డిస్టలరీ యూనిట్ ఏర్పాటుతో సుమారు 300 మందికి ఉద్యోగావకాశాలు కలుగుతాయన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ సహాయ సహకారాలతో రాష్ట్రంలో భారీగా పరిశ్రమలు ఏర్పాటు కావడం శుభపరిణామన్నారు.ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు దమ్ము కిషోర్‌బాబు, గ్రేస్ రాజా, టీడీపీ నేతలు పార్థసారధి, కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, అక్కరపల్లి మాధవరెడ్డి, కాటంరెడ్డి మల్లికార్జునరెడ్డి, మదన్‌మోహన్‌నాయుడు, సిద్దులయ్యనాయుడు, కృష్ణమనాయుడు, పెంచలయ్య పాల్గొన్నారు.

వారిపై కేసు నమోదు చేయండి

● అమరావతి మహిళలను కించపరిచినవారిపై ఎస్పీకి టీడీపీ నేతల ఫిర్యాదు

తిరుపతి, జూన్8(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళ లను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన.. చేయించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏపీజీబీసీ చైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ మీడియాతో మాట్లాడారు. ఆంధ్రుల రాజధాని అమరావతిపై జగన్ టీవీలో జగన్మోహన్ రెడ్డి, భారతి దంపతుల ప్రోద్బలం లేకుండా ఇలాంటి నీచమైన చర్చాగోష్ఠి జరగదన్నారు. దీనిపై జగన్ వెంటనే రాష్ట్ర ప్రజలకు, మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు. జర్నలిస్టుల ముసుగులో ఉన్న సంస్కారహీనులు, కిరాయి బ్యాచ్ మహిళలను కించపరుస్తూ చేసిన నీచపు వ్యాఖ్యలు మహిళల వ్యక్తిత్వం మీద దాడిగా చూస్తున్నారన్నారు. జగన్ రెడ్డి కుంభకోణాలపై ప్రజల దృష్టి మళ్లించేందుకే అమరావతిపై దుర్మార్గపు దాడి చేయించారని, స్వార్థ రాజకీయం కోసం ఇంత నీచానికి దిగజారిన జగన్ వైఖరిని ప్రజలు, మేధావులు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. వీరిపై మహిళా కమిషన్, ఎస్సీ కమిషన్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీని కలిసినవారిలో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, నాయకులు పులుగోరు మురళీకృష్ణారెడ్డి, కుమారమ్మ, దంపూరి భాస్కర్, మన్నెం శ్రీనివాసులు, చినబాబు, పాటకం వెంకటేష్, కార్పొరేటర్ అన్నా అనిత, మునిశేఖర్ రాయల్, ఆముదాల తులసీరాం, కొట్టే హేమంత్ రాయల్, కంకణాల రజనీకాంత్, రామారావు తదితరులున్నారు.



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ తదితరులు

మామిడి రైతుకు లభించని 'మద్దతు'



● కిలో రూ.8కి ముందుకొచ్చింది 5 ఫ్యాక్టరీలు
● రూ.ఏడు వద్దే ఆగిన మిగిలిన యాజమాన్యాలు
● సంప్రదింపులు జరుపుతున్న అధికారులు

చిత్తూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుకు ఇంకా మద్దతు ధర లభించలేదు. తోతాపురికి కిలో రూ.12 చొప్పున అధికారులు మద్దతు ధర ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది తమకు గిట్టుబాటు కాదని పల్ప్ ఫ్యాక్టరీలు చెప్పాయి. ఇక, రాష్ట్ర ప్రభుత్వం కిలోపై రూ.నాలుగు రాయితీ ప్రకటించింది. దీంతో పల్ప్ ఫ్యాక్టరీలు రూ.8 ఇస్తే.. రాయితీ కలిపి రైతులకు రూ.12 మద్దతు ధర లభిస్తుంది. చిత్తూరులో 35, తిరుపతి జిల్లాలో 5 చొప్పున 40 పల్ప్ ఫ్యాక్టరీలున్నాయి. ఇక, ర్యాంపులలోనూ మామిడి కాయలు కొంటుంటారు. కాగా, చిత్తూరు జిల్లా పరిధిలోని ఐదు ఫ్యాక్టరీల యాజమాన్యాలు మాత్రం రూ.8 చొప్పున చెల్లించేందుకు ముందుకురాగా, మిగతావి రూ.ఏడు వద్దే ఆగాయి. వీరితో సంప్రదిస్తున్నామని, మరో నాలుగు రోజుల్లో మద్దతు ధర అమలయ్యేలా చూస్తామని అధికారులు చెబుతున్నారు. ఈనెల 10 నుంచి జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలు తెరచుకునేలా, మద్దతు ధరను ఇచ్చేలా అధికారులు సిద్ధం చేశారు. మరోవైపు తమిళనాడులోని కృష్ణగిరి ఫ్యాక్టరీల్లో కిలో మామిడి రూ.5 నుంచి రూ.6 మధ్యలో అమ్ముడుబోతోంది. మన ప్రభుత్వం రూ.4 సబ్సిడీని ప్రకటించిన నేపథ్యంలో అక్కడి కలెక్టర్ కూడా తమిళనాడు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా.. వారి నుంచి స్పందన లేదు. దీంతో అక్కడి రైతులు మన జిల్లాకు మామిడి కాయల్ని తెచ్చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ కాయలు రాకుండా సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా పెంచాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కాగా, ఫ్యాక్టరీల్లో 2023, 2024లలో తయారుచేసిన సుమారు 40వేల టన్నుల పల్ప్ అలాగే ఉండిపోయిందని యాజమాన్యాలు చెబుతున్నాయి. పల్ప్ కొనుగోలు చేసిన కంపెనీల నుంచీ బిల్లులు పెండింగులో ఉన్నాయని, దీంతో మామిడి కాయలను కొనే పరిస్థితి లేదంటున్నారు.

12నుంచి క్రషింగ్ మొదలుపెట్టాలి

● లేదంటే రైతుల ఆగ్రహాన్ని చవిచూస్తారు
● పల్ప్ ఫ్యాక్టరీలకు మామిడి ధరల స్థిరీకరణ కమిటీ హెచ్చరిక

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పల్ప్ ఫ్యాక్టరీలు ఈనెల 12వ తేదీనుంచి పూర్తిస్థాయిలో క్రషింగ్ మొదలుపెట్టకుంటే రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని మామిడి ధరల స్థిరీకరణ కమిటీ హెచ్చరించింది. ఆదివారం చిత్తూరులో రైతు త్యాగరాజరెడ్డి అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ప్రభుత్వం తోతాపురి కిలోకు రూ.4 ప్రోత్సాహకం అందజేస్తున్న తరుణంలో రైతులకు రూ.12 గిట్టుబాటు ధర చెల్లించాలని కమిటీ పునరుద్ఘాటించింది. కన్వీనర్లు ఆనంద నాయుడు, టి.జనార్దన్ తదితరులు మాట్లాడుతూ.. తోతాపురి మామిడి పక్వానికి వచ్చినా పొరుగురాష్ట్రాల నుంచి చౌకగా పొందేందుకోసం పల్ప్ ఫ్యాక్టరీలవారు ఇప్పటికీ క్రషింగ్ మొదలుపెట్టలేదని విమర్శించారు. పొరుగు రాష్ట్రాల నుంచి కాయలు రాకుండా రైతులు సైతం ఎక్కడికక్కడ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగమూ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు పాటించని ఫ్యాక్టరీల లైసెన్సులు రద్దు చేయాలన్నారు. రైతు నాయకులు హరిబాబు చౌదరి, భారతి తదితరులు మాట్లాడుతూ ప్రతి ఫ్యాక్టరీ ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. ఫ్యాక్టరీకి తెచ్చిన కాయలను మూడు గంటల్లోగా అన్‌లోడింగ్ చేసేలా చూడాలని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయాలని కమిటీ తీర్మానించింది.

యోగాతో మానసిక ఆరోగ్యం: ఎమ్మెల్యే పాశిం


యోగాలో పాల్గొన్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యోగా చేయడం వలన మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంగా ఉంటామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో వాకర్స్ అసోసియేషన్ సహకారంతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చునన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని సీఎం చంద్రబాబునాయుడు యోగాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 21న విశాఖలో ఐదు లక్షల మందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నారన్నారు. అదే రోజు గూడూరులో జరిగే యోగాను విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీమ్, రాజేంద్రప్రసాద్, మస్తాన్‌నాయుడు, కట్టా మురళీకృష్ణ, యోగా మాస్టర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఎన్నిక ఏకగ్రీవం


ఎన్నిక సమావేశంలో కుక్కమల్లి రవి తదితరులు

నాయుడుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలైన ఎంఎస్‌సీ, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్‌ల కమిటీ ఎన్నికలను నాయుడుపేట ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎంఎస్ఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుక్కమల్లి రవి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. నాయుడుపేట మండల ఇన్‌చార్జిగా కొండాపురం వెంకటరమణ, ఓజిలి మండల ఇన్‌చార్జిగా గంగిపల్లి శివ, దొరవారిసత్రం మండలం ఇన్‌చార్జిగా మాసారం చెంగమ్మ, పెళ్లకూరు మండల ఇన్‌చార్జిగా ఉచ్చూరు రవీంద్ర, సూళ్లూరుపేట మండల ఇన్‌చార్జిగా ఉచ్చూరు రఘు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ఎంఎస్‌సీ రాష్ట్ర నాయకులు జిల్లా ఇన్‌చార్జి వర్ల దేవదాసు, వావిళ్ల శివ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్ ధనంజయ, జిల్లా ప్రధాన కార్యదర్శి శీనయ్య, పర్రి వీరరాఘవులు, ఎంఎస్‌సీ సూళ్లూరుపేట మహిళా అధ్యక్షురాలు చెంగమ్మ, ప్రధాన కార్యదర్శి రాఘవ పాల్గొన్నారు.

లాభసాటి సాగుకు భూ సార పరీక్షల దోహదం

డక్కిలి, జూన్ 8 : (ఆంధ్రజ్యోతి) రైతులు భూ సార పరిక్షలు ద్వారా సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వెంకటగిరి కృషివిజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త విజశ్రీ అన్నారు. ఆదివారం మోపూరులో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, సమతుల ఎరువుల వాడకం, భూసార పరిక్ష ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవచ్చునన్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యవసాయ


కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త విజయశ్రీ

శాస్త్రవేత్త బండెప్ప మాట్లాడుతూ రైతులకు భూసార పరీక్ష విధానాల గురించి వివరించారు. నిమ్మలో పూత నియంత్రణ, పెరటి కోళ్ల పెంపకం వంటి వాటిపై కరపత్రాలు ద్వారా అవగాహన కల్పించారు. రైతులతో కలిసి ఉద్యాన అధికారులు ముఖాముఖి చర్చా కార్యక్రమం నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త నాగార్జునరెడ్డి, మోపూరు వ్యవసాయ అసిస్టెంట్ హరిచంద్ర ప్రసాద్ తదిరులు ఉన్నారు.

వైభవంగా ఓసూరమ్మ మహోత్సవం

నాయుడుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : భీమవరం గ్రామదేవత ఓసూరమ్మ మహోత్సవాన్ని సర్పంచ్ నెలవల అమృతసరళ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విజ


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

యశ్రీ పాల్గొన్నారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలంకరణతో, విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు పొంగళ్లు సమర్పించారు. ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం-అమృతసరళ దంపతులు స్వయంగా అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, పల్లమాల రామిరెడ్డి, చంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, పేరంశెట్టి శ్రీరాం ప్రసాద్, బొమ్మన పళణి ఉన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి వార్షికోత్సవాలు

కోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆర్యవైశ్యసంఘ నాయకులు పాలకమండలి ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పలు అభిషేకాలు చేశారు. పలు రకాల పూలతో విశేష అలంకారం చేశారు. భక్తుల సమక్షంలో పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు అమ్మవారి పల్లకీ ఊపి మొక్కులు తీర్చుకున్నారు. కోలాట కార్యక్రమాలనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.


పల్లకి సేవలో కన్యకా పరమేశ్వరి

శాకాంబరి అలంకారంలో కోటమ్మ



కోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కోటమ్మ అమ్మవారిని ఆదివారం శాఖాంబరిగా అలంకరించారు. పలురకాల పండ్లు, కాయగూరలతో అలంకరించి విశేష పూజలు చేశారు. అంతకుముందు పలు అభిషేకాలు చేశారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వారికి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

తూపిలిపాళెం బీచ్‌లో పర్యాటకుల సందడి



వాకాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : తూపిలిపాళెం సముద్రతీరం ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. పలు ప్రాంతాల నుంచి పర్యాటకులతో బీచ్ రద్దీగా, సందడిగా మారింది. ఎండనుంచి ఉపశమనం పొందేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు కుటుంబాలతో తరలివచ్చారు. యువతరం పలు ఆటలతో కేరింతలు కొట్టారు. తీరంలో పర్యాటకు వసతి సముదాయాన్ని ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు. వాకాడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఎమ్మెల్యే విజయశ్రీ మానవత

నాయుడుపేట టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళను తన కాన్వాయ్ వాహనంలో ఎక్కించుకొని ప్రభుత్వ వైద్యశాలలో చేర్చి ఎమ్మెల్యే విజయశ్రీ మానవత్వం చాటుకున్నారు. వివరాలలోకి వెళ్లితే... ఆదివారం నాయుడుపేట-చెన్నై జాతీయ రహదారి వద్ద ఎమ్మెల్యే కాన్వాయ్ వస్తుండగా చిల్లకూరు మండలం బూదనం గ్రామానికి చెందిన రాజశేఖర్-భవానీ దంపతులు మోటారు సైకిల్‌పై వస్తూ డివైడర్‌ను ఢీ కొన్నారు. ఈ సంఘటనను గుర్తించి ఎమ్మెల్యే తన వాహనాన్ని ఆపారు. తీవ్రంగా గాయపడిన భవానీని కాన్వాయ్‌లో డీఎస్పీ వాహనంలో ఎక్కించుకుని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. వైద్యసేవలు అందించేలా చూశారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

పెళ్లకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పేకాటస్థావరాలపై పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ ఘటన ఎర్రగుంట గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు ఎర్రగుంట గ్రామసమీపంలో ఖాళీస్థలంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు పేకాటస్థావరాలపై దాడులు జరిపి పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, 3,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వరదయపాళెం మండలం రాచకండ్రిగ గ్రామానికి చెందిన చిన్నకుమార్ బంధువులతో కలిసి సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయంలో వేడుకలకు ఒకే బైక్‌పై వస్తున్నారు. కొండూరు జాతీయ రహదారి వద్ద పశువులు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. అదే దారిలో నెల్లూరు వైపు వెళ్తున్న కారు సడన్ బ్రేక్ వేయడం, ఆ వెనుకే మరోకారు ఈ కారును ఢీ కొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు స్వల్పగాయాలయ్యాయి. రెండు కార్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. వెంటనే స్థానికులు గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల సీట్లు ఖరారు చేసుకోవాలి

కోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఈ ఏడాది ఇంటర్, పదోతరగతుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు సీట్లు ఖరారు చేసుకోవాలని గురుకులాల డీసీవో గీత సూచించారు. లేకపోతే రద్దవుతాయని ఆమె పేర్కొన్నట్లు ఆదివారం స్థానిక ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. 5వ తరగతిలో కూడా సీట్లు పొందిన వారు కూడా ఖరారు చేసుకోవాలన్నారు. పలు అంబేడ్కర్ గురుకులాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఈ ఏడాది ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారని తెలిపారు.

23న ఒలంపిక్ రన్


ప్రసన్నకుమార్‌ను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఒలంపిక్ డేను పురస్కరించుకుని ఈ నెల 23వ తేదీన ఒలంపిక్ రన్ నిర్వహించనున్నట్లు ఒలంపిక్ జిల్లా అధ్యక్షుడు వై.ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఉదయం చంద్రగిరి మండలం మిట్టపాలెం గ్రామంలోని శ్రీనివాస హోటల్లో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఒలంపిక్ రన్‌ను విజయవంతం చేసేందుకు సహకరించాలని క్రీడా సంఘాలను కోరారు. ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ క్రీడా సంఘాల ఆధ్వర్యంలో త్వరలో ఓ స్పోర్ట్స్ స్కూల్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం ప్రసన్నకుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సాయికుమార్, ఉపాధ్యక్షులు శివప్రసాద్, సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్, రత్నాకర్, గోపినాయుడు, శివయ్య, ప్రేమ్, శ్రీధర్, హిమత్ పాల్గొన్నారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

తిరుపతి(సెంట్రల్), జూన్8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆదివారం తెల్లవారుజామున ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. వేసవి సెలవుల కారణంగా రైల్వేస్టేషన్ కొన్ని రోజులుగా ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది. ఈ క్రమంలో గంజాయి అక్రమ రవాణా జరిగే అవకాశముంటుందనే అనుమానంతో తనిఖీలు చేపట్టారు. పార్సిల్ కార్యాలయం, లగేజీ కేంద్రంతో పాటు ఆరు ప్లాట్‌ఫారాలు, విశ్రాంతి గదులు, రాకపోకలు నిర్వహించే ఎక్స్‌ప్రెస్ రైళ్లను పోలీసులు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో జీఆర్‌పీ సీఐ ఆశీర్వాదం, ఎస్ఐ ధర్మేంద్ర, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ రాజేంద్ర పాల్గొన్నారు.

మహిళల మండిపాటు

తిరుపతి, జూన్8(ఆంధ్రజ్యోతి) : అమరావతిని వేశ్యల రాజధానిగా, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతో నిండిన ప్రాంతంగా దిగజారుడు వ్యాఖ్యలు చేసి రాజధాని ప్రాంత మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, వంతపాడిన యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావులను తక్షణం అరెస్టు చేయాలని తిరుపతి కూటమి మహిళలు డిమాండు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ ఆధ్వర్యంలో ఆదివారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట మహిళలు వారి చిత్రపటాలపై చెప్పులు, చీపుర్లతో కొట్టి నిరసన తెలిపారు

నీటి పథకాలకు నిధుల గలగల

మున్సిపాలిటీలో తీరనున్న తాగునీటి ఇక్కట్లు

సూళ్లూరుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి కష్టాలు తీరనున్నాయి. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన తాగునీటి పథకాల పనులు పట్టాలెక్కనున్నాయి. 2014-2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆసియా మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ) నిధులతో తాగునీటి పథకాలను చేపట్టింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ నిధులను దారిమళ్లించింది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పనులు నిలిచిపోయాయి. గతేడాది అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం తిరిగి పనులనుపై దృష్టి సారించింది. అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యుఐడీఎఫ్) సాయంతో అమలుకు సిద్ధమైంది. సూళ్లూరుపేటకు రూ.164.14 కోట్లు, నాయుడుపేటకు రూ.125.44 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.


మన్నారుపోలూరులో అసంపూర్తిగా ట్యాంకు

పెరిగిన వ్యయం: వైసీపీ హయాంలో ఐదేళ్లుగా తాగునీటి పథకాల విస్తరణ పనులు నిలిచిపోవడంతో నిర్మాణ వ్యయం పెరిగింది. కొత్త రేట్ల ప్రకారం పబ్లిక్ హెల్త్ శాఖ అంచనాలను రూపొందించింది. చెరువుల ఆధునికీకరణ, పైపులైన్ల నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, నీటి శుద్ధిప్లాంట్ల విస్తరణ వంటి పనులు చేపట్టనున్నారు. మంగళంపాడు చెరువులో 2 వేల ఎంఎల్ సామర్థ్యంతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించనున్నారు. అక్కడే ఓవర్ హెడ్ ట్యాంకు, మన్నారుపోలూరులో మరో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించనున్నారు. అక్కడ నుంచి పైపు లైన్ల ద్వారా ట్యాంకు నింపి పట్టణానికి తాగునీరందించనున్నారు. నాయుడుపేట


మంగళంపాడు చెరువులో అసంపూర్తిగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

జువ్వలపాలెం చెరువులో 1,417 ఎంఎల్ సామర్థ్యంతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించనున్నారు.

వైసీపీ నిర్లక్ష్యం: టీడీపీ హయాంలో తాగునీటి పథకాల విస్తరణకు ఏఐఐబీ నుంచి విడుదలైన నిధులు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు జమయ్యాయి. తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం వాటా ధనం విడుదల చేయలేదు. ఏఐఐబీ నిధులనూ వాడేసుకుంది. ఫలితంగా తాగునీటి పథకాల విస్తరణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు ఈపనులపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలా చొరవ తీసుకున్నారు.

మహిళల పట్ల అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

సూళ్లూరుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రాంత మహిళలకు సంబంధించి సాక్షి ఛానల్ చర్చలో కొందరు వ్యాఖ్యలు దారుణమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. జర్నలిస్టు కృష్ణంరాజు, సాక్షి ఛానల్‌పై టీడీపీ నాయకులతో కలిసి ఆదివారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు అమరావతిని అభివృద్ధి చేస్తుంటే వైసీపీ విష ప్రచారం చేస్తోందని విమర్శించారు. వైసీపీ అధినేత జగన్ ఆరంభం నుచంఛి సాక్షి ఛానల్‌లో తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారన్నారు. మహిళలను కించపరిస్తే సాక్షి ఛానల్, పేపరును బహిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరుమూరు


ఫిర్యాదు చేస్తున్న వెంకటగిరి నేతలు

సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, కొక్కు శంకరయ్య, వెంకటేశ్వర్లు, రాజ సులోచనమ్మ పాల్గొన్నారు. **వెంకటగిరి:** అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ ఆదివారం కూటమి ఆధ్వర్యంలో మహిళలు, ఆ పార్టీ కీలక నేతలు ఆదివారం వెంకటగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసు స్టేషన్ వద్ద కొంత సేపు నిరసన వ్యక్తం చేశారు. కూటమి నేతలు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాథనాయుడు, పప్పు చంద్రమౌళి రెడ్డి, మంకు ఆనంద్, చంద్రారెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, చంగారావు తదితరులు పాల్గొన్నారు. **గూడూరు:** మాజీ సీఎం జగన్ ప్రోత్సాహంతోనే కొందరు నీచమైన వాఖ్యలు చేస్తున్నారని తెలుగు మహిళా నాయకులు ఆరోపించారు.


ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు

మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మట్టం శ్రావణి, గుండాల లీలావతి, శ్రీదేవి, కల్పన తదితరులు పాల్గొన్నారు. **చిట్టమూరు:** బాధ్యత గల జర్నలిస్టు మహిళలపై అనుచిత వాఖ్యలు చేయడం హేయమైన చర్యని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ఖండించారు. చిట్టమూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కృష్ణంరాజు, శ్రీనివాసరావు, సాక్షి టీవీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు.

మేనకూరు దారిలో ముప్పుతిప్పలు



నాయుడుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట మండలం సెజ్ బైపాస్‌రోడ్డు మేనకూరు వద్ద గుంతలమయంగా తయారైంది. అధ్వానంగా ఉన్న సెజ్‌రోడ్డులో పరిశ్రమలకు రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు 4500 ఎకరాలలో చిన్నతరహా, మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఇక్కడి సెజ్‌లో ఉన్నాయి. పరిశ్రమలకు ముడిసరుకుల రవాణాకు, ఉత్పత్తులు గమ్యస్థానాలకు చేరవేతకు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రాధాన్యత కలిగిన సెజ్ బైపాస్‌రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటంతో ఇబ్బందులెదురవుతున్నాయి. అధికారులు బైపాస్‌సెజ్ రోడ్డుకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

లేత జొన్నగడ్డి తిని నాలుగు ఆవులు, రెండు గేదెల మృతి

● పక్వానికి రాకపోవడంతో విషంగా మారిన గడ్డి

తిరుపతి రూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామంలో పక్వదశకు చేరని లేత జొన్నగడ్డిని దాణాగా తీసుకుని ఆదివారం నాలుగు ఆవులు, రెండు గేదెలు మృతిచెందాయి. బాధితులు చెంచమ్మ, నాగరాజు దంపతుల వివరాల మేరకు.. పొలంలో సాగుచేస్తున్న జొన్నని శనివారం పశువులకు దాణాగా వేశారు. నీరు తాగిన కొంతసేపటికే మృతి చెందాయి. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మదన్, స్థానిక వెటర్నరీ డాక్టర్ యోగానంద్ వచ్చి పరిశీలించారు. పక్వానికి రాని (ఇమెచ్యూర్ జోవార్) జొన్నగడ్డిని దాణాగా తీసుకోవడం వల్ల దానిలోని హైడ్రోజన్ సయినైడ్ విషంగా మారి పశువులు మృతిచెందినట్లు నిర్ధారించారు. వీటి విలువ రూ.4.70 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. జొన్నగడ్డి పక్వానికి వచ్చిన తర్వాత, దాన్ని కోసి ఒకరోజు నీడలో ఆరబెట్టాలని, మాగుడు గడ్డిగా మారిన తర్వాతనే దాన్ని పశువులకు దాణాగా వేయాలని సూచించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగూరు శ్రీనివాసులు ద్వారా సమాచారం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని బాధిత రైతులతో ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, రూరల్ తహసీల్దార్ రామాంజులు నాయక్‌తో ఫోన్లో మాట్లాడి వివరించారు. వీటిలో రెండు ఆవులు గర్భం దాల్చి ఉండడంతో సంప్రదాయం ప్రకారం గ్రామస్తుల సమక్షంలో పంచనామా చేసి, గుంతలో పూడ్చిపెట్టారు. వీఆర్వో పుల్లూరు రాఘవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రెడ్డి జ్యోతీశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

సర్వజన హితానికి జగన్నాథ రథయాత్ర


ప్రచార ప్రతులను ఆవిష్కరిస్తున్న సుఖ్‌దేవ్ తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అందరి శ్రేయస్సు కాంక్షిస్తూ పట్టణంలో ఈ నెల 28న జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు నెల్లూరు ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షుడు సుఖదేవ్ మహారాజ్ తెలిపారు. ఆదివారం కాపువీధి ఇస్కాన్ మందిరంలో జగన్నాథ రథయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరు ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో మూడోసారి రథయాత్ర చేస్తున్నామన్నారు. తమిళనాడు, తెలంగాణతో ఇతర రాష్ట్రాల వక్తలు పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తారన్నారు. . దాదాపు 30 వేల మందికి పైగా రథయాత్రలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. భగవద్గీత పై ప్రచారం, సనాతన ధర్మం గురించి ప్రజలకు తెలియజేయడమే కాకుండా వ్యక్తి వికాసం అందరి మంచి కోరుతూ రథయాత్ర చేస్తున్నామన్నారు. అనంతరం హరేరామ సంకీర్తనలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రథయాత్ర ఇన్‌చార్జీ వెంకటరమణా రెడ్డి, శ్రీనివాసులు, పవన్‌కుమార్, రాజశేఖర్ దాస్, డీవీఎస్ గిరిత పాల్గొన్నారు.

48 ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా తంబళపల్లె అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 48 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం స్థానిక అటవీశాఖ అధికారులు జయప్రసాద్‌రావు, మోహన్‌రెడ్డి, షబీన్‌తాజ్‌లతో కలిసి తంబళ్లపల్లె పరిధిలోని బురకాయలకోట అటవీ ప్రాంతంలోని వేపూరికోట ఫారెస్టు బీటులో శనివారం తనిఖీలు చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున అన్నగారిపల్లె సమీపంలోని వంకగట్టు వద్ద స్మగ్లర్లను గమనించారు. పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి నలుగురిని పట్టుకోగలిగారు. 48 ఎర్రచందనం దుంగలు లభించాయి. స్మగ్లర్లు అన్నమయ్య జిల్లాకు చెందిన వారు. ఎర్రచందనం దుంగలు, మోటార్ సైకిల్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.





కళాకృతుల ఆధ్యాత్మిక విందు

తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవల ముందు కళాబృందాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులను భక్తిపారవశ్యానికి లోనుచేశాయి.